నేటి కందం- నేటికి అందం

జనవంద్యుడు మెస్సీతో
నసుముల రేవంతరెడ్డి యాడుచు నుండన్
కనసొంపగు ఫుట్బాలుకు
గణనీయంబగు కరణిన గ్లామరు హెచ్చెన్ !!

(హైదరాబాద్ లో అంతర్జాతీయ ఫుట్బాల్ ఆటగాడు మెస్సీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడడంతో ఫుట్ బాల్ ఆటకే ప్రాధాన్యత పెరిగింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

సినిమాల పైరసీని
చేసే వాళ్లపైన కొరడా
రేట్లు పెంపు టిక్కెట్ల
రీతిపైనా ఏది బిరడా.
సామాన్య ధరలకన్ని
చిత్రాలు అందుబాటు
చేస్తేతప్ప పైరసీని
చేయలేరు కట్టుబాటు

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 14-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:104 పేజీలు:6 వెల: రూ.1/-


# కామ్రేడ్ల కంచుకోటలో కాషాయ జెండా..

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: కేరళలోని తిరువనంతపురంలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలోబీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ జయకేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీఅక్కడి ప్రజలకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో ఓ కీలక మలుపు అని ఆయన అభిప్రాయపడ్డారు.

'తిరువనంతపురం ప్రజలకు ధన్యవాదాలు! నగర కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ-ఎన్డీఏకు ఆధిక్యం లభించడం కేరళ రాజకీయాలోఓ కీలక మలుపు. రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలను మా పార్టీ మాత్రమే తీర్చగలదని ప్రజలు భావిస్తున్నారు. ఈ శక్తిమంతమైన నగరాభివృద్ధికి, ప్రజలకు జీవన సౌలభ్యాన్ని పెంపొందించేందుకు మా పార్టీ కృషి చేస్తుంది. ఈ ఎన్నికల్లో అద్భుత ఫలితాలను సాధించడంలో శ్రమించిన బీజేపీ కార్యకర్తలందరికీ నా కృతజ్ఞతలు. అట్టడుగు స్థాయి నుంచి పనిచేయడంలో కార్యకర్తల దీర్ఘకాల కృషి, పోరాటాలను నేడు మనం గుర్తుచేసుకోవాలి. మన కార్యకర్తలే మనకు బలం' అని మోదీ పేర్కొన్నారు.

## మోదీ సంచలన ట్వీట్..

తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో.. 101 వార్డుల్లో ఎన్డీఏ 50 స్థానాలను గెలుచుకుని చారిత్రక విజయం సాధించింది అక్కడ అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ కేవలం 29 వార్డులకు పరిమితమైంది. ఇక.. కాంగ్రెస నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ 19 స్థానాలను సొంతం చేసుకోగా.. స్వతంత్ర అభ్యర్థులు రెండు వార్డులను కైవసం చేసుకున్నారు.

2020లో జరిగిన ఇదే ఎన్నికల్లో.. ఎల్డీఎఫ్ 52 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే 33 స్థానాల్లో, యూడీఎఫ్ 10 చోట్ల గెలుపొందాయి. అయితే.. 2026లో కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ(ఃఏఖ) ఆధిక్యం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సుమారు నాలుగు దశాబ్దాల అనంతరం.. కమ్యూనిస్టు కంచుకోటలో కాషాయ జెండా ఎగరడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి.

# ఇది ఫ్రెండ్లీ మ్యాచ్.. కోల్‌కతా లాంటి సంఘటనలకు తావులేదు: శాట్స్ చైర్మన్

హైదరాబాద్, డిసెంబర్ 13:స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీ నేడు సాయంత్రం భాగ్య నగరానికి రానున్న సంగతి తెలిసిందే. ఉప్పల్ స్టేడియంలో మెస్సీ జట్టుతో సీఎం రేవంత్ రెడ టీమ్.. ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడనుంది. అయితే.. ఈ మ్యాచ్ పూర్తిగా స్నేహపూర్వకంగా మాత్రమే జరగనుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి ఏబీఎన్‌కు తెలిపారు.

'నేడు జరగబోయేది పూర్తిగా ఫ్రెండ్లీ మ్యాచ్. పూర్తి స్థాయి మ్యాచ్ కాదు. కేవలం క్రీడలను ప్రోత్సహించడానికి మాత్రమే దీన్ని నిర్వహిస్తున్నాం. కోల్‌కతాలాంటి సంఘటనలు హైదరాబాదలో జరగవు' అని శివసేనా రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంతో విద్యార్థులు క్రీడలవైపు ఆలోచిస్తారని ఆయన అన్నారు. రాజకీయాల్లో అయినా, క్రీడల్లో అయినా.. రేవంత్‌దే పైచేయి అని కొనియాడారు.అంతకముందు.. కోల్‌కతాలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో మెస్సీ ఎక్కువ సేపు స్టేడియంలో సమయం కేటాయిం చలేకపోయ ాడు. మెస్సీని చూసే ందుకు జనం భారీఎత్తున తరలిరావడంతో.. భద్రతా కారణాల దృష్ట్యా కేవలం 10 నిమిషాల్లోనే అతణ్ని స్టేడియం నుంచి తీసుకెళ్లిపోయారు నిరా వ్యహకులు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కొందరు ఆగ్రహానికి లోనై స్టేడియంలోని కుర్చీలు విరగ్గొట్టినట్టు సమాచారం.

# సహకరించండి.. మెస్సీ భద్రతపై సీపీ సజ్జనార్ కామెంట్స్

హైదరాబాద్, డిసెంబర్ 13: ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి హైదరాబాద్‌కు చేరుకున్నారు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా లియోనల్ మెస్సీతో పాటు రోడ్రిగో, లూయిన్ హైదరాబాద్‌కు వచ్చారు. ఎయిర్‌పోర్ట్ నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. రాత్రి 7 గంటల వరకు ప్యాలెస్‌లోనే ఉండనున్నారు. ఈ నేపథ్యంలో ఫలక్‌నుమా ప్యాలెస్ వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్ వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్యాలెస్‌లో సుమారు 250 మంది మెస్సీని కలుస్తారని, వారందరికి ముందుగానే క్యూ ఆర్ కోడ్ పాస్‌లు ఇచ్చామని తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మెస్సీని కలవనున్నట్లు తెలిపారు. రెండు గంటల పాటు మెస్సీ ప్యాలెస్‌లో ఉంటారని చెప్పారు. గతంలో బెంగాల్‌లో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో భద్రతను మరింత పటిష్ఠం చేశామన్నారు. పాస్‌లు తీసుకున్న వారి పూర్తి వివరాలు పోలీసుల దగ్గర ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం సాఫీగా సాగడానికి హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లు పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టి పనిచేస్తున్నాయని వెల్లడించారు. సిటీ పోలీస్ అధికారులు, ప్రజలు ఈవెంట్ సక్సెస్ అవ్వడానికి ప్రభుత్వంతో సహకరించాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

# తెలంగాణలో నేడు మలిదశ పంచాయతీ పోరు.. ఏర్పాట్లు కట్టుదిట్టం..

హైదరాబాద్, డిసెంబర్ 13:తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. గెలుపు కోసం పార్టీ అభ్యర్థులు తమ ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. రేపు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా 3,911 గ్రామాల్లో రెండోదశ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 13,128 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉండగా.. 29,903 వార్డులకు 78,158 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. రేపు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరిగి ఫలితాలు రానున్నాయి.

ఎన్నికల నిర్వహణ కోసం శనివారం సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. తొలిదశ పోరులో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు మెజార్టీ స్థాయిలో గెలిచారు. ఆ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు. రెండో విడత ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా చేసుకొని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇంటింటికి తిరిగి నగదు, మద్యం, మాంసాహారం ఇస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. డబ్బు అయితే ఫోన్ పే లాంటి మాధ్యమాల ద్వారా నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కుల సంఘాల వారీగా తాయిలాలు, హామీలు ఇస్తు మచ్చిక చేసుకుంటూ అభ్యర్థులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నట్లుగా సమాచారం.

ముఖ్యంగా శంషాబాద్, షాద్ నగర్, కేశంపేట ప్రాంతాల్లో ఓటుకు 5 వేల నుంచి 10 వేల వరకు పంచినట్లు సమాచారం. పోలింగ్ రోజు మద్యం దుకాణాలు బంద్ ఉంటాయి. ఇక రెండో విడత ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందని ఆయా జిల్లాల కలెక్టర్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే..తొలిదశ పోరు కొన్ని చెదురుమదురు సంఘటలను మినహా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

# యూపీ బీజేపీ చీఫ్ పదవికి కేంద్ర మంత్రి నామినేషన్



లక్నో, డిసెంబర్ 13: ఉత్తరప్రదేశ్ బీజేపీ చీఫ్ పదవికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి శనివారంనాడు నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే లాంఛనంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికను సెంట్రల్ ఎలక్షన్ అధికారి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారంనాడు ప్రకటించనున్నారు.

చౌదరి తన నామినేషన్ పత్రాన్ని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి నరేంద్ర పాండే, కేంద్ర ఎన్నికల పరిశీలకులు వినోద్ తావ్డేకు లక్నో కార్యాలయంలో అందజేశారు. ఉత్తప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాఠక్, జల్ శక్తి మంత్రి స్వతంత్రదేశ్ సింగ్ తదితరులు ఈ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. చౌదరి పేరును యోగి ఆదిత్యనాథ్, కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాఠక్, స్మృతి ఇరానీ, స్వతంత్ర దేవ్ సింగ్, సూర్య ప్రతాప్ షాహి, సురేశ్ ఖన్నా, బేబీ రాణి మౌర్య ప్రతిపాదించారు.

నామినేషన్ సమర్పించిన అనంతరం చౌదరి మాట్లాడుతూ, నామినేషన్ దాఖలు పూర్తయిందని, స్క్రూటినీ జరుగుతోందని చెప్పారు. ఆదివారంనాడు అధికారికంగా ప్రకటించిన తర్వాత తాను మరింత వివరంగా మాట్లాడగలనని చెప్పారు. పదవి పెద్దదా చిన్నదా అనేది ముఖ్యం కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా ఒక కార్యకర్తగా అంకిత భావంతో తాము పనిచేస్తామని చెప్పారు.

పార్టీ అధ్యక్షుడి ఎన్నిక పూర్తయింది

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక పూర్తయిందని, ఒకే నామినేషన్ దాఖలైందని మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ తెలిపారు. నామినేషన్ పరిశీలన అనంతరం ఆదివారంనాడు అధికారిక ప్రకటన ఉంటుందని చెప్పారు. పంజక్ చౌదరి నామినేషన్‌ను తామంతా ఏకగ్రీవంగా ప్రతిపాదించామని తెలిపారు. రాజకీయంగా కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో త్వరలో పంచాయతీ ఎన్నికలు, 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక చాలా కీలకమని విశ్లేషకులు చెబు?తున్నారు.

ఎవరీ పంకజ్ చౌదరి

కుర్మీ సామాజిక వర్గానికి చెందిన పంకజ్ చౌదరి ఏడుసార్లు మహారాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఓబీసీ వర్గాల్లో మంచి పలుకుబడి ఉన్న నేతగా గుర్తింపు పొందారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన అత్యంత విశ్వసనీయుడనే పేరుంది. కుర్మీ సామాజిక వర్గానికి చెందిన నేతను రాష్ట్ర అధ్యక్షుడుగా మూడుసార్లు బీజేపీ ఎన్నుకుంది. మాజీ ఎంపీ వినయ్ కతియార్, మాజీ మంత్రి ఓం ప్రకాష్ సింగ్, స్వతంత్ర దేవ్ సింగ్ ఈ పదవిలో పనిచేశారు.

# మెరుగుపడిన ఇండిగో కార్యకలాపాలు.. రోజుకు 2 వేల విమానాల రాకపోకలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో (ఎనిటతిఉనీ) కార్యకలాపాలు మళ్లీ సాధారణ స్థితికి చేరుకున్నాయి. వరుసగా రెండోరోజు కూడా 2 వేలకుపైగా విమానాలను నడిపినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. గత ఐదు రోజులుగా తమ కార్యకలాపాలు నిలకడగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సవరించిన షెడ్యూల్ ప్రకారం రోజుకు 2 వేలకుపైగా విమానాలను నడుపుతున్నామని ఇండిగో తెలిపింది.

సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మొత్తం 138 గమ్యస్థానాలకు విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయని, సమయపాలన కూడా సాధారణ స్థాయికి చేరిందని ఇండిగో పేర్కొంది

. కాగా ఈ నెల ప్రారంభంలో ఇండిగో విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. డిసెంబర్ 8న 1,700కి పైగా విమానాలు నడిపిన ఇండిగో, ఆ సంఖ్యను క్రమంగా పెంచుకుంటూ వచ్చింది.

డిసెంబర్ 12న 2,050కి పైగా విమానాలను ఆపరేట్ చేయగా కేవలం రెండు సర్వీసులు మాత్రమే సాంకేతిక కారణాలతో రద్దయ్యాయని కంపెనీ తెలిపింది. డిసెంబర్ 13న కూడా 2,050కి పైగా విమానాలు నడుపాలన్నా అంచనాలకు ఇండిగో చేరువైంది. కార్యకలాపాలలో వైఫల్యానికి గల కారణాలను విశ్లేషించడానికి 'చీఫ్ ఏవియేషన్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌సీ' అనే స్వతంత్ర కన్సల్టెన్సీని నియమించినట్లు సంస్థ వెల్లడించింది.

# పథకం పేరు మారిస్తే ప్రజలకు ఒరిగేదేంటి..? : ప్రియాంకాగాంధీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చింది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చడంవల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఇలాంటి చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెప్రాంత పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఎన్నో ఏళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. పథకం పేరు మార్చితే.. దానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు, వస్తువుల పై ఇప్పటికే ముద్రించిన పేర్లను మార్చాల్సి వస్తుందని ప్రియాంకా గాంధీ అన్నారు.ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆమె చెప్పారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.

# మరికొన్ని గంటల్లో హైదరాబాద్ అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ

హైదరాబాద్, డిసెంబర్ 13:ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ మరికొన్ని గంటల్లో హైదరాబాద్ రానున్నారు. శనివారం సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో చారిటీ మ్యాచ్ ఆడనున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లో రాచకొండ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు దారి మళ్లింపులు అమలులో ఉంటాయని తెలిపారు. అందువల్ల వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

'జీవోఏటీ' టూర్‌లో భాగంగా శనివారం తొలుత కోల్‌కతాకు చేరుకోనున్న మెస్సీ.. సాయంత్రం 4గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో దిగనున్నాడు. అక్కడి నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో పాల్గొంటాడు. ఫొటో దిగేందుకు రికార్డు స్థాయిలో రూ.10 లక్షలు చెల్లించిన 60 మంది మెస్సీతో ఫోజులివ్వనున్నారు. దీని ద్వారా వచ్చిన మొత్తాన్ని ఫుట్‌బాల్ క్లినిక్‌లో యువ ప్లేయర్ల అభివృద్ధి కోసం వినియోగిస్తామని 'గోట్ హైదరాబాద్' సమన్వయకర్త పార్వతిరెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న చలి తీవ్రత

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: దేశంలో చలిగాలుల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. హిమాలయాలకు సమీపంలోని ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ చలి తీవ్రత చంపేస్తున్నది.

ఈ క్రమంలో రానున్న రెండు రోజుల్లో తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరుగనున్నదని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. చలితో పాటు పొగమంచు కూడా తీవ్రంగా ఉంటుందని తెలిపింది.

తెలంగాణతోపాటు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలలోనూ తీవ్రమైన చలిగాలులు వీస్తాయని ఐఎండీ ప్రకటించింది. పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, మెదక్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. అత్యవసరమైతే తప్ప ఉదయం, రాత్రి వేళల్లో ప్రజలు బయటికి రావద్దని హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లోనూ ఉదయం వేళల్లో దట్టంగా పొగమంచు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ తెలిపింది.




# పౌరుల భాగస్వామ్యంతో సుస్థిర శక్తి ఆవిష్కరణలు

## (14 డిసెంబర్ "జాతీయ శక్తి పొదుపు (ఆదా) దినం" సందర్భంగా)

భారత కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 14 డిసెంబర్ రోజున "జాతీయ శక్తి పొదుపు దినం (నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. దేశాభివృద్ధిలో శక్తి వనరుల పాత్ర అనిర్వచనీయం. దేశ ప్రగతిని కొలిచే ప్రమాణంగా తలసరి శక్తి వినియోగాన్ని తీసుకుంటారు. వివిధ కేంద్రాల్లో ఉత్పత్తి అవుతున్న శక్తిని ఆదా చేస్తూ, అవసరం మేరకు మాత్రమే విడుదల చేస్తూ, దేశాభివృద్ధికి బాటలు వేయడానికి 2002లో భారత ప్రభుత్వం "బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిసియెన్సీ" అనే సంస్థను నెలకొల్పడం జరిగింది. ఉత్పత్తి అవుతున్న శక్తిలో ప్రసార నష్టాలు, పంపిణీ నష్టాలను తగ్గిస్తూ ప్రతి ఒక్కరు బాధ్యతగా శక్తి వినియోగాన్ని విచక్షణతో చేయాల్సిన సమయం ఆసన్నమైనది. 2023 వివరాల ప్రకారం భారత దేశంలో తలసరి ఎనర్జీ వినియోగం 985 కెడబ్ల్యూహెచ్‌గా నమోదైనది.

పౌరుల భాగస్వామ్యంతో సుస్థిర శక్తి ఆవిష్కరణలు:

జాతీయ శక్తి పొదుపు దినం-2025 ఇతివృత్తంగా "పౌరుల భాగస్వామ్యంతో సుస్థిర శక్తి ఆవిష్కరణలతో ముందడుగు" అను అంశాన్ని తీసుకున్నారు. వ్యక్తులు, కుటుంబాలు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ సంస్థలు లాంటి అన్ని క్షేత్రాల్లో శక్తి పొదుపు విధానాలను పాటిస్తూ, సుస్థిర పొదుపు బాటన నడవాలి, ఉత్పాదకత పెంచాలి. శక్తిని పొదుపు చేయడం అంటే ఉత్పత్తి చేయినట్లే అని ప్రచారం చేయాలి. శక్తి వినియోగం తగ్గితే పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇచ్చినట్లే అని నమ్మాలి. ఇంధన పరిరక్షణ అవసరాన్ని నేటి విద్యార్థిలోకానికి అవగాహన పరచడం తప్పనిసరి అని తెలుసుకోవాలి. పర్యావరణ అనుకూల పద్ధతుల ప్రచారంతో పాటు సమాజంలో శక్తి ప్రచార రాయబారులుగా యువతను వినియోగించాలి. నేటి బాలలకు రేపటి శక్తి విలువను తెలియజేయాలి.

మానవాళి సుస్థిరాభివృద్ధి కోసం నేడు శక్తిని, శక్తి వనరులను పొదుపుగా వాడుకోవడం, సాంప్రదాయేతర తరిగే శక్తి వినియోగాలను తగ్గించడం, పునరుత్పాదక శక్తిని గరిష్టంగా వినియోగించడం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని శక్తి ఉత్పత్తి, వినియోగాలను పెంచడం నిరంతర ప్రక్రియగా జరగాలి. రేపటి ప్రకాశవంతమైన సమాజానికి నేటి శక్తి పొదుపు ఆధారం అని తెలపాలి. శక్తి ఉత్పత్తి, వినియోగాలను తగ్గిస్తే భూమండలం నివాసయోగ్యంగా తయారు అవుతుంది.



- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆయన సినిమాలు భారత చలనచిత్ర రంగంలో నిరంతరం కొత్త ప్రమాణాలను నెలకొల్పాయి

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:ఈ రోజు తిరు రజనీకాంత్ గారి 75వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రజనీకాంత్ గారి నటన భిన్న తరాల ప్రేక్షకులను ఆకట్టుకుందనీ, ఆయనకు సర్వత్ర ప్రశంసలు లభించాయనీ ప్రధానమంత్రి అన్నారు. వేర్వేరు పాత్రలు, శైలులు, సినిమా తరహా స్టైళ్లు.. ఇవన్నీ రజనీ సినిమాల్లో మనం గమనించవచ్చని, ఆయన సినిమాలు భారత చలనచిత్ర రంగంలో నిరంతరం కొత్త ప్రమాణాలను నెలకొల్పాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఏడాది తిరు రజనీకాంత్ చలనచిత్ర సీమలో 50 ప్రఖ్యాత సంవత్సరాలు పూర్తి చేసుకోవడం కూడా ఒక విశేష ప్రాముఖ్యత కలిగిన అంశం. ఇది ఆయన ప్రగతి ప్రస్థానాన్నీ, చిత్ర పరిశ్రమపై ప్రసరిస్తున్న చిరకాల ప్రభావాన్నీ, అందిస్తున్న సాటిలేని సేవనూ సూచిస్తోందన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వేర్వేరు సందేశాల్లో శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

"తిరు రజనీకాంత్ గారికి ఆయన 75వ పుట్టినరోజు ప్రత్యేక సందర్భంగా ఇవే శుభాకాంక్షలు. ఆయన నటన విభిన్న తరాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. సర్వత్ర గొప్ప ప్రశంసలను పొందింది. ఆయన వృత్తి జీవనంలో రకరకాల భూమికలను, శైలులను ఆవిష్కరించి నిరంతరం అనేక ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ఈ సంవత్సరం మరో విశేషం కూడా ఉంది.. చలనచిత్ర జగతిలో ఆయన 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఆయనకు ఆరోగ్యవంతమైన జీవనం లభించాలనీ, దీర్ఘాయుష్షు కలగాలనీ ప్రార్థిస్తున్నాను."

# కొబ్బరి కనీస మద్దతు ధరకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:2026 సీజన్ కోసం కొబ్బరి కనీస మద్దతు ధరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. సాగుదారులకు లాభదాయక ధరలను అందించడం కోసం అన్ని తప్పనిసరి పంటల కనీస మద్దతు ధరను అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్ల స్థాయిలో నిర్ణయించనున్నట్లు ప్రభుత్వం 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించింది. 2026 సీజన్‌కు తగిన సగటు నాణ్యత గల మిల్లింగ్ కొబ్బరి కోసం ఎంఎస్‌పీని క్వింటాలుకు రూ.12,027గా, బాల్ కొబ్బరికి రూ.12, 500గా నిర్ణయించారు.

2026 సీజన్ కోసం ఎంఎస్‌పీ గత సీజన్ కంటే మిల్లింగ్ కొబ్బరి క్వింటాలుకు రూ.445, బాల్ కొబ్బరి క్వింటాలుకు రూ.400 పెరిగింది. 2014 మార్కెటింగ్ సీజన్‌లో వరుసగా క్వింటాలుకు రూ.5,250, రూ.5,500గా ఉన్న మిల్లింగ్ కొబ్బరి, బాల్ కొబ్బరిల ఎంఎస్‌పీని ప్రస్తుతం క్వింటాలుకు రూ.12,027, రూ.12, 500లకు పెరిగింది. అంటే 2026 మార్కెటింగ్ సీజన్‌కు ఇవి వరుసగా 129 శాతం, 127 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

ఈ అధిక ఎంఎస్‌పీ కొబ్బరి సాగుదారులకు మెరుగైన లాభదాయక రాబడిని నిర్ధరించడమే కాకుండా... దేశీయంగా, అంతర్జాతీయంగా కొబ్బరి ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సరిపడా కొబ్బరి ఉత్పత్తిని విస్తరించేలా రైతులను ప్రోత్సహిస్తుంది. ధర మద్దతు పథకం కింద కొబ్బరి సేకరణ కోసం నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్‌లు సెంట్రల్ నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తుంటాయి.

# బెజవాడలో హైటెక్ బందోబస్తు

**-భవానీ దీక్షల విరమణకు సర్వసన్నద్ధం**
**-సీసీ కెమెరాలు, ఏఐ డ్రోన్లతో సీపీ పర్యవేక్షణ**
**-పాత నేరస్థులపై ఫేషియల్ రికగ్నిజేషన్ నిఘా**
**-అస్త్రం యాప్‌తో ట్రాఫిక్ నియంత్రణ**



అమరావతి, డిసెంబర్ 13: భవానీ దీక్షా విరమణ కార్యక్రమం నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు స్వీయ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతికతను ఆయుధంగా చేసుకుని భక్తుల భద్రతకు విస్తృత చర్యలు చేపట్టారు. మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం నుంచి సి.సి. కెమెరాల ద్వారా స్నాన ఘాట్‌లు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, కేశఖండన శాలలు, హోల్డింగ్ ఏరియాలను పర్యవేక్షిస్తూ పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఏ.ఐ. డ్రోన్ కెమెరాల సహాయంతో గిరిప్రదక్షిణ ప్రాంతాల్లో రద్దీని నిరంతరం గమనించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు.

ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాల ద్వారా ఆలయ పరిసరాల్లో పాత నేరస్థుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసి, గుర్తించిన వెంటనే కంట్రోల్ రూం నుంచి సంబంధిత సిబ్బందికి సమాచారం పంపి తక్షణ చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ పరంగా అస్త్రం యాప్ ద్వారా రద్దీని నియంత్రిస్తూ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపేలా చర్యలు చేపట్టారు.

అలాగే హోమగుండాలు, విరుముడి స్టాల్స్, ప్రసాదం కౌంటర్లను పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. షిరీన్ బేగం, ఇన్‌చార్జ్ కలెక్టర్ ఇలాక్కియా, క్రైమ్ ఏ.డి.సి.పి. ఎం. రాజారావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

వరంగల్,డిసెంబర్ 12: గ్రామ పంచాయతీ ఎన్నికలు సాఫీగా, సజావుగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అలజడులు, అల్లర్లు, అవరోధాలు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో, రెండవ విడత ఎన్నికలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 14వ తేదీన వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలో జరిగే రెండవ విడత ఎన్నికలకు గాను కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతిభద్రతల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్ (సీఆర్‌పీసీ) సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ నిషేధాజ్ఞల ప్రకారం ఐదుగురికి మించిన గుంపులుగా ప్రజలు చేరడం నిషేధించబడిందని తెలిపారు.

ఈ నిషేధాజ్ఞలు 14వ తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

నిషేధాజ్ఞలను అతిక్రమించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

అలాగే ఓట్ల లెక్కింపు సమయంలో కూడా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల విధులకు ఆటంకాలు కలిగించినా, అల్లర్లు సృష్టించినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు.

# కర్ని గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**ఆశీర్వదించి సర్పంచ్ గా గెలిపించండి: దండు రాధ దత్తురాం**



మక్తల్, డిసెంబర్ 13: కర్ని గ్రామ అభివృద్ధికి గ్రామస్తులు సర్పంచ్‌గా గెలిపిస్తే? గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని కర్ని గ్రామ సర్పంచ్ అభ్యర్థి దండు రాధ దత్తురాం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి శనివారం కర్ని గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా దండు రాధ దత్తురాం మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు నిశ్చలమైన కృషి చేస్తానని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా గ్రామ అభివృద్ధి నిలిచిపోతున్నందున, సర్పంచ్‌గా గెలిస్తే గ్రామాన్ని సర్వత్రా అభివృద్ధి దిశలో నడిపిస్తానని చెప్పారు.

అత్యంత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులవారికి అందడం, గ్రామంలోని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం వంటి బాధ్యతలను స్వయంగా చూసుకుంటానని తెలిపారు. గ్రామంలోని ప్రతి సమస్యకు పరిష్కారం కనుగొని, నిస్వార్థంగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను కోరారు.

సర్పంచ్‌గా గెలిస్తే కర్ని గ్రామం రూపురేఖలు మారిపోతాయని, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మద్దతుతో అన్ని విధాలుగా అభివృద్ధి చూపిస్తానని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు చిన్న రంగప్ప, మాజీ సర్పంచ్ రాఘవేంద్ర గౌడ్, బిజెపి, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, వాకిటి కిష్టప్ప, భగవంతు రెడ్డి, మైబు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ నమూనా ముద్రణపై ఎంపీడీవోకి ఫిర్యాదు

**-బ్యాలెట్ నమూనా ముద్రణ సరిగ్గా లేదని బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**



నల్గొండ, డిసెంబర్ 12:మూడో విడత సాధారణ ఎన్నికల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చెన్నారావుపేట మండల కేంద్ర సర్పంచ్ అభ్యర్థుల నమూనా బ్యాలెట్ ముద్రణ ఓటర్లకు ఇబ్బందికరంగా మారుతుందని బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కంది శ్వేతకృష్ణ చైతన్య రెడ్డి ఇవాళ స్థానిక ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఒకే బ్యాలెట్ పేపర్ లో సీరియల్ నంబర్ల ప్రకారం ఒకే కాలమ్ లో గుర్తులు రాకుండా రెండు కాలమ్స్ లో గుర్తులు ముద్రించారని, స్వస్తిక్ ముద్ర వల్ల ఒక గుర్తుపై ఓటు వేస్తే అది ఇంకో గుర్తుపై కూడా ఇంక్ అంటుకుని ఓట్లు చెల్లకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత పద్ధతిలో ఒకే కాలమ్ లో సీరియల్ నంబర్ల ప్రకారం బ్యాలెట్ పేపర్లను తిరిగి ముద్రించాలని పార్టీ పక్షాన కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, జున్నుతుల మహేందర్ రెడ్డి, కుసుమ నరేందర్ లు పాల్గొన్నారు.

ఎనిమిది మంది కంటే ఎక్కువ అభ్యర్థులు ఉంటే రెండు కాలమ్స్ లోనే గుర్తులు ఉంటాయి.ఈ విషయమై ఆంధ్రప్రభ ప్రతినిధి జిల్లా పంచాయతీ అధికారి వివరణ కోరగా.. ఎనిమిది మంది అభ్యర్థుల కంటే ఎక్కువగా పోటీ ఉంటే ఒకే బ్యాలెట్ లోనే రెండు కాలమ్స్ లో సీరియల్ నెంబర్లు, గుర్తులు ముద్రించి వస్తాయన్నారు. చెన్నారావుపేటలో ఎనిమిది మంది సర్పంచ్ అభ్యర్థులు, నోటాతో కలిపి తొమ్మిది ఉండడంతో ఇక్కడ కూడా ఒకే బ్యాలెట్ రెండు కాలమ్స్ లో గుర్తులు ముద్రించి వచ్చాయన్నారు. పోలింగ్ అధికారులు ఎడమ వైపు మడతల, కుడి వైపు ఒక మడత చేసి ఓటర్లకు బ్యాలెట్ పత్రం ఇస్తారని, ఓటర్లు తాము నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన తర్వాత మడత చేసి బ్యాలెట్ బాక్స్ లో వేస్తే ఓట్లు చెల్లకుండా ఉండే ఆస్కారమే లేదన్నారు. ఎవరికి సందేహాలు ఉన్నా పోలింగ్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు నివృత్తి చేస్తారన్నారు.

# కోల్‌సేతు విండోను ఆమోదించిన కేంద్ర క్యాబినెట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:బొగ్గు పారిశ్రామిక వినియోగం- ఎగుమతి కోసం ఉద్దేశించిన కోల్‌సేతు (కోల్ లింకేజ్ ఫర్ సీమ్‌లెస్, ఎఫిషియంట్ అండ్ ట్రాన్స్‌పరెంట్ యుటిలైజేషన్) విధానానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నేడు సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదించింది. దీని ప్రకారం ఎన్ఆర్ఎస్ లింకేజ్ విధానంలో కోల్‌సేతు అనే విండోను కొత్తగా తీసుకురానున్నారు. బొగ్గు రంగంలో ప్రభుత్వం చేపడుతోన్న వరుస సంస్కరణల్లో ఈ కొత్త విధానం ఒక భాగంగా ఉంది.2016 ఎన్ఆర్ఎన్ (అనియంత్రిత రంగాలు) లింకేజ్ వేలం విధానంలో కోల్‌సేత్ అనే ప్రత్యేక విండోను కొత్తగా తీసుకురావటం ద్వారా వేలం ఆధారంగా దీర్ఘకాలిక ప్రాతిపదికన బొగ్గు లింకేజీలను అన్ని రకాల పారిశ్రామిక వినియోగం, ఎగుమతి కోసం కేటాయించడానికి ఇది అనుమతిస్తుంది. ఈ వేలంలో బొగ్గు అవసరం ఉన్న అన్ని రకాల దేశీయ కొనుగోలుదారులు పాల్గొనవచ్చు. ఈ విండో కింద కోకింగ్ కోల్ లేదు.ఎన్ఆర్ఎస్ బొగ్గు లింకేజీల వేలం విషయంలో ఇప్పటికే ఉన్న విధానం ప్రకారం అన్ని కొత్త బొగ్గు లింకేజీలను సీపీపీ (సొంత బొగ్గు గనులు ఉండే విద్యుతుత్పత్తి కేంద్రాలు) కంపెనీలతో సహా ఎన్ఆర్ఎస్‌లకు (అంటే సిమెంట్, స్టీల్ (కోకింగ్), స్పాంజ్ ఐరన్, అల్యూమినియం, ఎరువులు(యూరియా) మినహా ఇతరులు) వేలం ఆధారంగా కేటాయిస్తారు. ఈ ఎన్ఆర్ఎస్ లింకేజ్ విధానం ప్రకారం నిర్దిష్ట తుది వినియోగదారులకే ఉప-రంగాల కేటాయింపులు ఉంటాయి.

ప్రస్తుత, భవిష్యత్తు మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వ్యాపార సౌలభ్యంతో పాటు ఇప్పటికే ఉన్న బొగ్గు నిల్వల వినియోగాన్ని వేగవంతం చేసేందుకు, దేశ ఇంధన అవసరాలను తీర్చే విషయంలో దిగుమతి అయిన బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు అనియంత్రిత రంగాలకు బొగ్గు సరఫరా విషయంలో ఉన్న ప్రస్తుత విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది. అలాగే ఎన్ఆర్ఎస్‌లోని లింకేజ్‌లను ఎటువంటి తుది వినియోగ పరిమితులు లేకుండా బొగ్గు వినియోగదారులకు విస్తరించాల్సిన అవసరం ఉంది. వాణిజ్య గనుల తవ్వకం కోసం బొగ్గు రంగాన్ని తెరిచేందుకు ఎటువంటి తుది వినియోగ పరిమితులు లేకుండా బొగ్గు బ్లాకుల కేటాయింపునకు ఇది అనుమతిస్తుంది. ఏదైనా పారిశ్రామిక వినియోగం, ఎగుమతి కోసం వేలం ఆధారంగా దీర్ఘకాలిక ప్రాతిపదికన బొగ్గు లింకేజీలను కేటాయించడానికి మరొక విండో లేదా ఉప-రంగాన్ని ఈ విధానం తీసుకొస్తుంది. ఈ ప్రతిపాదిత విండోలో వ్యాపారులు పాల్గొనరాదు. ఎన్ఆర్ఎస్‌లోని నిర్దిష్ట తుది-వినియోగదారులకు సంబంధించిన ఉప-రంగాలకు ఉన్న ప్రస్తుత బొగ్గు లింకేజ్‌ల వేలం కొనసాగుతుంది. ఆ నిర్దిష్ట తుది-వినియోగదారులు కూడా కోల్‌సేతు విండోలో పాల్గొనవచ్చు.

తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
డా॥ మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ
1-7-79, చైతన్యపురి, హైదరాబాద్-500060. సెల్ నెంబర్: 9440444019
ద్విదశాబ్ది సభ
స్మరణ (గ్రంథావిష్కరణ)
వేదిక: రవీంద్రభారతి, సమావేశ మందిరం, మొదటి అంతస్థు, హైదరాబాద్
సమయం: 14 డిసెంబర్ 2025 ఆదివారం సాయంకాలం 5.30 ని॥లకు
అధ్యక్షులు : డా॥ డి. చంద్రశేఖరరెడ్డి
ముఖ్య అతిథి, గ్రంథావిష్కరణ : నిఖిలేశ్వర్
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
వక్తలు : సుధామ
డా॥ నాళేశ్వరం శంకరం
డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్
డా॥ జతిన్ కుమార్
శీలా సుభద్రాదేవి అధ్యక్షులు
అందరూ ఆహ్వానితులు
మాడభూషి లలితాదేవి కన్వీనర్

# వయస్సుకు తగని కంటెంట్ నుంచి పిల్లల భద్రత కోసం

## ఓటీటీ వేదికలపై గట్టి ఆంక్షలు విధించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1) వాక్ స్వేచ్ఛకు హామీ ఇచ్చింది. అదే సమయంలో, డిజిటల్ వేదికల్లో నకిలీ, అసత్య, తప్పుదారి పట్టించే సమాచారం వల్ల సమాజానికి కలుగుతున్న నష్టాలను ప్రభుత్వం కూడా గుర్తించింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000 (25 ఫిబ్రవరి, 2021) కింద ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) 2021 నిబంధనలను ప్రభుత్వం నోటిఫై చేసింది.

ఈ నిబంధనలలోని మూడో భాగం ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్ (ఓటీటీ వేదికలు) నిర్వాహకుల కోసం నైతిక నియమావళిని నిర్దేశిస్తుంది. ఈ నియమావళి ప్రకారం, అమలులో ఉన్న చట్టాల కింద నిషేధించిన ఏ కంటెంట్‌ను కూడా నిర్వాహకులు ప్రసారం చేయకూడదు.

ఈ నైతిక నియమావళి ప్రకారం, నిబంధనల షెడ్యూల్లోని సాధారణ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వాహకులు కంటెంట్‌ను వయస్సు ఆధారంగా ఐదు వర్గాలుగా విభజించాలి.

ఈ నైతిక నియమావళి ప్రకారం, పిల్లలు తమ వయసుకు తగని కంటెంట్‌ను చూడకుండా నియంత్రించేందుకు ఓటీటీ వేదికలు తగిన రక్షణ చర్యలను కూడా అమలు చేయాలి.

ఈ నిబంధనలు, ఇతర అంశాలతో పాటు, వార్తలు సమకాలీన అంశాల ఆధారిత కార్యక్రమాలను ప్రసారం చేసే వారు అనుసరించాల్సిన నైతిక ప్రమాణాలను కూడా అందిస్తాయి. దీని ప్రకారం కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ చట్టం, 1995 కింద నిర్దేశించిన ప్రోగ్రామ్ కోడ్, ప్రెస్ కౌన్సిల్ చట్టం-1978 కింద ఉన్న పాత్రికేయ సంబంధ ప్రమాణాలను కూడా పాటించడం తప్పనిసరి.

ప్రోగ్రామ్ కోడ్, పాత్రికేయ సంబంధ నైతిక ప్రమాణాలు ఇతర అంశాలతో పాటు, తప్పుదారి పట్టించే అసత్యమైన లేదా అర్ధసత్యమైన సమాచారాన్ని ప్రసారం చేయరాదని నిర్వాహకులను నిర్దేశిస్తున్నాయి.

నిబంధనలలో సూచించిన లెవల్-ఎ, లెవల్-ఎఎ లలోని స్వీయ నియంత్రణ నిబంధనలు వాక్ స్వాతంత్ర్యం, పత్రికా భావ ప్రకటన స్వేచ్ఛ స్ఫూర్తిని పరిరక్షిస్తాయి.

అలాగే, ఐటీ నిబంధనలలోని రెండో భాగాన్ని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) నిర్వహిస్తుంది. యూ ట్యూబ్, ఫేస్ బుక్ వంటి మాధ్యమాలు స్పష్టంగా నకిలీ, అవాస్తవ, తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా నిరోధిస్తుంది.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నకిలీ వార్తలను గుర్తించడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)లో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్సీయూ) ను నవంబర్, 2019 లో ఏర్పాటు చేశారు.

భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలలో ఉన్న అధికార వర్గాల నుంచి వార్త ప్రామాణికతను ధ్రువీకరించిన తరువాత, ఫ్యాక్ట్ చెక్ యూనిట్ తన సోషల్ మీడియా వేదికల్లో సరైన సమాచారాన్ని పోస్టు చేస్తుంది.

సమాచార సాంకేతిక చట్టం, 2000 లోని సెక్షన్ 69ఏ కింద, భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రత, భారతదేశ రక్షణ, ప్రభుత్వ భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెబ్‌సైట్లు, సోషల్ మీడియా పోస్టులను బ్లాక్ చేయడానికి ప్రభుత్వం అవసరమైన ఉత్తర్వులను జారీ చేస్తుంది.

దేశంలో సృజనకర్తల (క్రియేటర్ ఎకానమీ) ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు చేపట్టారు. వరల్డ్ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025, క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజెస్ (సీఐసీ), వేవ్స్ బజార్ వంటి కార్యక్రమాలు డిజిటల్ రంగంలో స్థానిక సాంస్కృతిక ప్రాతినిధ్యాన్ని పెంచడానికి దోహద పడ్డాయి.

క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజెన్ (సీఐసీ) దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభను సమీకరించింది. ఆవిష్కర్తలకు తమ ప్రాంతీయ నైపుణ్యాలను వృత్తిపరమైన డిజిటల్ కంటెంట్‌గా మార్చడానికి సహాయపడే విధంగా పరిశ్రమ అనుసంధానిత శిక్షణను అందించింది. వేవ్స్ 2025లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక సంగీత, జానపద కళల ప్రదర్శనలు అట్టడుగు స్థాయి కళాకారులకు అంతర్జాతీయ వేదికను అందించాయి. ఇది వారికి గుర్తింపును, జీవనోపాధిని మెరుగుపరచడానికి దోహదపడింది.

వేవ్స్ బజార్ ను కూడా ఒక జాతీయ మార్కెట్‌ప్లేస్‌గా ప్రారంభించారు. ఈ వేదిక భారతీయ ఆవిష్కర్తలు దేశంలోని ప్రాంతీయ వైవిధ్య ప్రత్యేకతలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి, ప్రపంచవ్యాప్త కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, పంపిణీదారులతో నేరుగా భాగస్వామ్యం చేయడానికి దోహదపడింది.

వేవ్స్ ఓటీటీ ద్వారా ప్రసార భారతి (స్థానిక కంటెంట్ సృజనకర్తలకు మద్దతునిస్తోంది. ఇది ప్రామాణికమైన ప్రాంతీయ అంశాలను ప్రచురించడానికి, ప్రోత్సహించడానికి, తద్వారా ఆదాయం ఆర్జించడానికి ఏకీకృత డిజిటల్ వేదికను అందించింది.

రాజ్యసభలో ఈ రోజు డాక్టర్ కనిమొళి ఎన్.వి.ఎన్. సోము ప్రశ్నకు సమాధానంగా సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ వివరాలు తెలిపారు.

# తెలియని లింకుల జోలికి వెళ్లొద్దు

చిత్తూరు, డిసెంబర్ 13: చిత్తూరు జిల్లాలో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, మత్తుమందుల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతపై అంతటా విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను జిల్లా పోలీసులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. చిత్తూరు పట్టణంలోని శ్రీ విద్యా కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ మహేశ్వర, చిత్తూరు క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఉమామహేశ్వర రావు పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.

సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, తెలియని లింకులు, అనుమానాస్పద సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరాదని సూచించారు..ఈ సందర్భంగా 1 టౌన్ ఇన్ స్పెక్టమహేశ్వర మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుమందుల వాడకం వల్ల వ్యక్తి భవిష్యత్తే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని హెచ్చరించారు. జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకుంటే సమాజాభివృద్ధికి యువత కీలక పాత్ర పోషించగలరని అన్నారు.

# ఇది మహిమానిత క్షేత్రం

### –శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి



జగ్గయ్యపేట , డిసెంబర్ 13:పవిత్ర కృష్ణా నది తీరంలో కొలువై ఉన్న శ్రీ వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ క్షేత్రం మహిమానిత క్షేత్రమని శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ సంభాషణ చేశారు. శనివారం జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి సమీపంలోని కృష్ణా నది తీరంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కొండపై స్వయంభు శ్రీ జ్వాల నరసింహ స్వామి దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్డును ఆయన ప్రారంభించారు.

శిలా ఫలకాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, పలు పరిశ్రమల ప్రతినిధులతో కలసి చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు.

డాక్టర్ ఉప్పాలపాటి శ్రీహరి సహచరుల సహకారంతో నిర్మించిన ఈ ఘాట్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం లో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ, ఈ ఘాట్ రోడ్డుతో భక్తులకు దర్శన సౌకర్యం మరింత మెరుగుపడనుందని, వేదాద్రి క్షేత్ర అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెసిపి రాంకో పరిశ్రమల ప్రతినిధులు ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్ బాబు భక్తులు పాల్గొన్నారు

# వినికిడి.. దృష్టి లోపంగల వినియోగదారుల కోసం ఓటీటీ

## సౌలభ్య మార్గదర్శకాల ముసాయిదా ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:దేశంలోని 'ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్' (ఓటీటీ) ప్రచురణ వేదికలలో వినికిడి, దృష్టి లోపంగల వ్యక్తులకు కంటెంట్ లభ్యత లక్ష్యంగా కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ 07.10.2025న మార్గదర్శకాల ముసాయిదాను జారీ చేసింది.

వికలాంగుల హక్కులపై ఐక్యరాజ్యసమితి సమావేశం తీర్మానం అమలులో భారత్ బాధ్యత మేరకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కింద సంక్రమించిన రాజ్యాంగ హక్కులకు అనుగుణంగా, దివ్యాంగుల హక్కుల చట్టం-2016తోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా, నైతిక నిబంధనలు) ప్రకారం ప్రస్తుతం అమలులోగల ఐటీ చట్టం-2000 (ఐటీ నిబంధనలు 2021) కింద 25.02.2021న ఈ ముసాయిదా మార్గదర్శకాలు విడుదలయ్యాయి.

వినికిడి, దృష్టి లోపంగల వారికి ఓటీటీ వేదికలలోని దృశ్య-శ్రవణ కంటెంట్ అందుబాటులో ఉండేలా చూడటం ఈ ముసాయిదా మార్గదర్శకాల లక్ష్యం. దీన్ని రెండు దశలలో అమలు చేసేందుకు తగిన కార్యక్రమాన్ని కూడా ఈ మార్గదర్శకాలు సూచిస్తాయి.

వినికిడి లోపం ఉన్న వారి కోసం 'దివ్యాంగులకు టెలివిజన్ కార్యక్రమాల సౌలభ్యం' దిశగా ప్రమాణాలను నిర్దేశిస్తూ సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ 11.09.2019న ప్రకటన జారీచేసింది.

ఈ ప్రమాణాలలోని 12వ భాగంలో దశలవారీగా సౌలభ్య కల్పన పూర్తికావాలని, ముందుగా ప్రభుత్వ ప్రసార సంస్థ (ప్రసార భారతి) దీన్ని అమలు చేయాలని, తదుపరి ప్రైవేట్ టీవీలు, న్యూస్ చానెళ్లు దీన్ని అనుసరించాలని అందులో నిర్దేశించింది.

కేంద్ర సమాచార-ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఇవాళ రాజ్యసభలో శ్రీమతి సంగీత యాదవ్, డాక్టర్ మేధా విశ్రమ్ కులకర్ణి, శ్రీ దీపక్ ప్రకాష్‌ల ప్రశ్నలకు సమాధానంగా ఈ సమాచారం వెల్లడించారు.

# అంతర్జాతీయ చిత్ర నిర్మాణ కేంద్రంగా మారుతున్న భారత్ -

## విధాన పరమైన ప్రక్రియలను సులభతరం చేస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:చలనచిత్రాల చిత్రీకరణకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కొన్ని కీలకమైన కార్యక్రమాలను ప్రారంభించింది.

ఈ దిశగా.. ఇండియా సినీ హబ్ (ఐసీహెచ్) పోర్టల్‌ను ప్రారంభించింది. చిత్రీకరణ అనుమతులకు దేశీయ, అంతర్జాతీయ చిత్ర నిర్మాతలు దరఖాస్తు చేసుకొనే వన్-స్టాప్ వేదిక ఇది. మిథిల, నలంద, గయతో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఫిల్మిక్/నాన్ ఫిల్మిక్ వనరుల ను, వైవిధ్యమైన షూటింగ్ ప్రాంతాలను గుర్తించేందుకు ఐసీహెచ్ నిర్మాతలకు సహకరిస్తుంది.

రాజ్యసభలో శ్రీ సంజయ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అందించారు.

# ఆదరించండి.. అభివృద్ధిని స్వాగతించండి

### –బుసరెడ్డిపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మంతురి స్వప్న



సంగారెడి, డిసెంబర్ 13: బుసరెడ్డిపల్లి గ్రామాభివృద్ధి కోసం ప్రజలు ఆదరించి కత్తెర గుర్తుకు ఓటేసి గెలిపించి, అభివృద్ధిని స్వాగతించాలని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మంతురి స్వప్న శశికుమార్ కోరారు.

తన ప్యానల్‌లోని వార్డు సభ్యులతో కలిసి గ్రామంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటు వేయడం అంటే అభివృద్ధికి మద్దతు తెలిపినట్లేనని ఆమె ఓటర్లకు వివరించారు.

మునిపల్లి మండలంలోనే బుసరెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు. గతంలో గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఓటర్లకు వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. బుసరెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కోసం మరో అవకాశం ఇవ్వాలని శశికుమార్ తన సతీమణి స్వప్నతో కలిసి గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సామాజిక మాధ్యమాల్లో తప్పుదోవ పట్టించే సమాచారానికి

## వ్యతిరేకంగా పౌరులను బలోపేతం చేయనున్న ఐటీ నిబంధనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:భారత రాజ్యాంగంలో అధికరణ 19 (1) ప్రకారం పౌరులకు భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది. అయితే సామాజిక మాధ్యమాల్లో నకిలీ, తప్పుడు,తప్పుదోవ పట్టించే సమాచారం పెరుగుతున్న సందర్భాలను గుర్తించిన భారత ప్రభుత్వం వాటిని నియంత్రించడంపై దృష్టి సారించింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం సమాచార సాంకేతికత చట్టం 2000 ప్రకారం సమాచార సాంకేతికత (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నియమాలు 2021ను ఫిబ్రవరి 25, 2021న నోటిఫై చేసింది.

ఈ నియమాల్లో భాగం-ఎఎఎ.. వార్తలు, సమకాలీన విషయాల ప్రచురణకర్తలు తప్పనిసరిగా పాటించాల్సిన నైతిక నియమావళి గురించి ప్రధానంగా వివరిస్తుంది. ఇందులో కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ చట్టం 1995 ప్రకారం నిర్దేశించిన కార్యక్రమ నియమావళిని అనుసరించడం, ప్రెస్ కౌన్సిల్ చట్టం 1978 ప్రకారం పత్రికా ప్రవర్తనా నియమాలకు కట్టుబడి ఉండటం ఉంటుంది.

ఐటీ నిబంధనల ప్రకారం నీతి నియమావళికి కట్టుబడి ఉండటానికి మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రవేశపెట్టింది.

అలాగే ఐటీ నిబంధనలు రెండో భాగంలో యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి మధ్యవర్తులు తమ ప్లాట్‌ఫారమ్‌లో తప్పుడు, అసత్యమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా నివారించాల్సిన బాధ్యత వాటిపై ఉందని వివరిస్తుంది.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నకిలీ వార్తలను గుర్తించేందుకు నవంబర్ 2019లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఓ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్ సీయూ) ను ఏర్పాటు చేసింది.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన అధికారులతో వార్తల ప్రామాణికతను నిర్ధారించిన తరువాత సరైన సమాచారాన్ని ఎఫ్ సీయూ తమ సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రచురిస్తుంది.

సమాచార సాంకేతిక చట్టం 2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం ప్రభుత్వం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, పోస్టులను నిరోధించడానికి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తుంది.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, దేశ రక్షణ, రాష్ట్ర భద్రత, శాంతి భద్రతలు వంటి అంశాల్లో ఈ చర్యలు తీసుకుంటుంది.

ఈ సమాచారాన్ని సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ నేడు రాజ్యసభలో డాక్టర్ లక్ష్మీకాంత్ బాజ్‌పాయీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా అందించారు.

# న్యూఢిల్లీలో చౌపాల్ కార్యక్రమాన్ని

## ప్రారంభించిన జౌళి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:జాతీయ చేనేత వారోత్సవాల సందర్భంగా జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని డెవలప్‌మెంట్ కమిషనర్ (హస్తకళలు) కార్యాలయం నేడు న్యూఢిల్లీలో చౌపాల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి నీలం షమీ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, వివిధ రాష్ట్రాల నోడల్ అధికారులు, చేతివృత్తుల రంగానికి చెందిన భాగస్వాములు పాల్గొన్నారు.

జాతీయ చేతివృత్తుల అభివృద్ధి కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా.. హస్తకళల సంప్రదాయాలపై అవగాహన కల్పించడం, పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, స్థిరమైన హస్తకళా సమూహాల ఏర్పాటును సులభతరం చేయడమే చౌపాల్ కార్యక్రమ లక్ష్యం. సంస్కరణ, ఆచరణ, పరివర్తన, సమాచార ప్రసారం అనే మంత్రాల ఆధారంగా దేశంలోని 100 ఆకాంక్షిత హస్తకళా జిల్లాలలో కళాకారుల నమోదు, పథకాలపై అవగాహన, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి కోసం చౌపాళ్లను జిల్లా స్థాయిలో శాశ్వత వేదికలుగా ఏర్పాటు చేయనున్నారు.

దేశంలో హస్తకళల వ్యవస్థను బలోపేతం చేయడానికి, గ్రామీణ స్థాయిలో కళాకారులను శక్తిమంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జౌళిశాఖ కార్యదర్శి పేర్కొన్నారు. చౌపాల్ కార్యక్రమం హస్తకళలపై అవగాహనను పెంపొందించడానికి, యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, పారిశ్రామిక అవకాశాలను పెంచే వేదికగా పనిచేస్తుందని ఆమె తెలిపారు. తద్వారా దేశవ్యాప్తంగా హస్తకళ సమూహాలలో స్థిరమైన జీవనోపాధికి దోహదపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమ తొలి దశకు ఎంపిక చేసిన 100 హస్తకళలకు చెందిన ఆకాంక్షాత్మక జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నోడల్ అధికారులతో జౌళిశాఖ కార్యదర్శి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా స్థాయి అవగాహన, చేరిక చర్యలను బలోపేతం చేయడానికి అవసరమైన ఆడియో-విజువల్ సామగ్రి, ఇతర పరికరాలను కలిగిన 'చౌపాల్ కిట్'లను పంపిణీ చేశారు. ఈ కిట్‌లు కళాకారుల ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు, సామర్థ్య నిర్మాణ శిక్షణలు, డిజిటల్ నమోదు వంటి కార్యాచరణలను సులభతరం చేస్తాయి.

# ఎమ్మెల్యే ని కలిసిన పోచంపల్లి సర్పంచ్



భూపాలపల్లి డిసెంబర్ 13: రేగొండ మండలం పోచంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కేసిరెడ్డి సబిత-ప్రతాప్ రెడ్డిని గ్రామ ప్రజలు నూతన సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా.. శనివారం, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కేసిరెడ్డి సబిత-ప్రతాప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే జీఎస్సార్ సర్పంచ్ అభ్యర్థిని శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముద్దమల్ల రవి, కాంగ్రెస్ నాయకులు వైనస భిక్షపతి, ఇల్ల రవి, మోటపోతుల తిరుపతి, పాడి దేవేందర్ రెడ్డి, జన్నపురెడ్డి మల్లారెడ్డి, కట్ల అన్నరెడ్డి, ముద్దామల్ల

# అవకాశం కల్పిస్తే.. రూపురేఖలు మారుస్తా

## నాగిరెడ్డిపల్లి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి: గోవింద్ గౌడ్



నారాయణపేట డిసెంబర్ 13:ఎంతో అభివృద్ధి చేశా ఓటుతో మరో అవకాశం కల్పిస్తే మంత్రి డా.వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామ రూపురేఖలు మార్చి మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని నాగిరెడ్డిపల్లి కాంగ్రెస్ సర్పంచ్ మద్దతు అభ్యర్థి గోవింద్ గౌడ్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా మద్దతు దారులతో కలిసి ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ?. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానని అన్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను తెలుసుకున్న వ్యక్తిగా నన్ను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు .గ్రామ అభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వాతిగౌడ్ వార్డు మాజీ సర్పంచ్ స్వాతిగౌడ్ వార్డు అభ్యర్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం.



సంగారెడ్డి డిసెంబర్ 13(నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, వార్డ్ మెంబెర్స్, ఉప సర్పంచ్ లను సన్మానించిన డిసిసి అధ్యక్షురాలు..టీజిఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ఎన్నికల్లో పోరాడి ఓడిపోయిన సర్పంచ్, వార్డ్ మెంబెర్స్ ల ను సన్మానించిన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిసంగారెడ్డి నియోజక వర్గంలో 45 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థుల విజయం...

జగ్గారెడ్డి మాట్లాడుతూ నేను రాకున్నా మీరు గెలిచి రావాలని చెప్పిన... నేను ప్రచారానికి రాకున్నా పార్టీ బలం మీ యుక్తి,శక్తితో గెలిచి వచ్చారు..మీ కృషి, కష్టంతో పాటు అన్ని వర్గాల , అన్ని మతాల సహకారంతో గెలిచి వచ్చారు.

కండువా వేసుకుని గెలిచిన వారు నా సర్పంచ్ లు, కండువా వేసుకుని ఓడిపోయిన సరే వారు నాకు సర్పంచ్ లు అని ముందే చెప్పిన గెలిచిన వారికి నిర్మలా ఓడిన వారికి నేను సన్మానం చేస్తా... ఎందుకంటే నేను కూడా ఓడిపోయిన..నేను రాకున్నా గెలిచి చూపించారు.. మీ అందరికీ నా అభినందనలు

కాంగ్రెస్ పార్టీ రెబల్ గా నిలబడి గెలిచిన వారికి నో ఎంట్రీ. ఇండిపెండెంట్ గా గెలిచిన వారు కాంగ్రెస్ లోకి రావాలనుకుంటే బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ నాయకులు నిర్ణయం తీసుకోండి. కొండాపూర్ సర్పంచ్ గా ఓడిపోయిన మస్కు అలవేని నర్సింహ రెడ్డి ని సదాశివ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమిస్తున్నట్లు ప్రకటించిన జగ్గారెడ్డి..

## విద్యార్థుల బకాయిలు విడుదల చేయాలని టీఎస్ఎస్ఏ డిమాండ్

**– ముఖ్యమంత్రి కి విద్య పై పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పై ప్రేమ ఉంటే వెంటనే పెండింగ్ ఫీజ్ బకాయిలను విడుదల చేయాలి**

**– దమళ్ల సత్యం**

ఖమ్మం, డిసెంబర్ 13 (నేటినిజం ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యపై నిజమైన ప్రేమ ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రావలసిన వేలకోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ల సత్యం డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ మీటింగ్‌లో ప్రొఫెసర్ కాసిం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యపై ఎక్కువ ప్రేమ ఉందని వ్యాకాయానించిన నేపథ్యంలో దమళ్ల సత్యం స్పందించారు. ముఖ్యమంత్రికి విద్యపై నిజంగా ప్రేమ ఉంటే పేద విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని, వేలకోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల గురుకులాలకు సొంతభవనాలు నిర్మించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని సత్యం పేర్కొన్నారు. వేలకోట్ల బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థులను బాధపెడుతున్నప్పుడు ప్రొఫెసర్ కాసిం ముఖ్యమంత్రిని పొగడడం బాధాకరమని విమర్శించారు. ప్రొఫెసర్ కాసిం ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి గుర్తు చేయవలసిందిగా, పేద విద్యార్థుల పట్ల ఆయనకున్న ప్రేమను చర్యల ద్వారా చాటుకోవాలని టీఎస్ఎస్ఏ తరపున డిమాండ్ చేశారు.

# సృజనాత్మక స్వేచ్ఛను కాపాడుతూనే తప్పుదారి పట్టించే సమాచారంపై ప్రభుత్వం చర్యలు

సృజనాత్మక స్వేచ్ఛను కాపాడుతూనే తప్పుదారి పట్టించే సమాచారంపై ప్రభుత్వం చర్యలురాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది. అయితే సామాజిక మాధ్యమాల్లో నకిలీ, తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం, కృత్రిమ మేధ ఆధారంగా సృష్టించే డీప్ ఫేక్ సంఘటనలు పెరుగుతుండటం.. ప్రజాస్వామ్య విధానాన్ని, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రమాదం ఉందని ప్రభుత్వం గుర్తించింది.

నకిలీ వార్తలను సాధారణంగా తప్పుడు, తప్పుదారి పట్టించే సమాచారంగా పేర్కొంటారు. దీనిని వార్తగా ప్రసారం చేస్తారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి హానికరమైన సమాచారాన్ని నిషేధించడానికి.. ఇప్పటికే దేశంలో విస్తృత చట్టబద్ధమైన, సంస్థాగత వ్యవస్థ పని చేస్తోంది.

కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (నియంత్రణ) చట్టం 1995 ప్రకారం టీవీ ఛానెల్లు ప్రోగ్రామ్ కోడ్‌ను అనుసరిస్తాయి.

ఇది అశ్లీలమైన, పరువు నష్టం కలిగించే, ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే సమాచారం, సూచనాత్మక సంకేతాలు, అర్ధ సత్యాలను కలిగిన ప్రసారాలను నిషేధిస్తుంది.

ఈ చట్టం కింద రూపొందించిన నిబంధనల ఉల్లంఘనలను పరిష్కరించడానికి మూడు దశల ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసింది.

ప్రోగ్రాం కోడ్ ఉల్లంఘనలను సలహాలు, హెచ్చరికలు, క్షమాపణలు చెప్పడం, తాత్కాలిక ప్రసారాల నిలిపివేత వంటి చర్యల ద్వారా పరిష్కరిస్తారు.

భారత ప్రెస్ కౌన్సిల్ జారీ చేసిన పత్రికా ప్రవర్తనా నిబంధనలు.. తప్పుడు, కించపరచే, తప్పుదారి పట్టించే వార్తల ప్రచురణను నిరోధిస్తుంది.

ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించిన తరువాత పత్రికలు, సంపాదకులు, పాత్రికేయులు మొదలైన వారిని హెచ్చరించడం, మందలించడం, నిందించడం వంటి చర్యలు తీసుకుంటుంది.

డిజిటల్ మీడియాలో వార్తలు , సమకాలీన విషయాలను ప్రచురించే వారి కోసం సమాచార, సాంకేతికత నియమాలు 2021 కింద ప్రత్యేక నైతిక నియమావళిని రూపొందించారు.

ఫేస్ బుక్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే సమాచారం, అసత్యపు వార్తలను నిరోధించాలి.

నైతిక నియమావళికి కట్టుబడి ఉండేందుకు మూడు-దశల ఫిర్యాదు పరిష్కార యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేశారు.

తప్పుడు, పరువు నష్టం కలిగించే సమాచారానికి సంబంధించిన ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించడానికి సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా ఒక ఫిర్యాదు అధికారిని నియమించాలి.

ఐటీ నిబంధనల రెండో భాగం ప్రకారం తప్పుడు, అసత్యమైన, తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చెందకుండా నిరోధించాల్సిన బాధ్యతను మధ్యవర్తి సంస్థలపై ఉంటుంది.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, దేశ రక్షణ, రాష్ట్ర భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, శాంతి భద్రతల ప్రయోజనాల దృష్ట్యా.. లేదా పై అంశాలకు సంబంధించిన ఏదైనా శిక్షార్హమైన నేరం చేసేందుకు ప్రేరేపించడాన్ని నిరోధించేందుకు సమాచార సాంకేతికత చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ప్రభుత్వం ఆదేశాలను జారీ చేస్తుంది.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నకిలీ వార్తలను పరిశీలించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కింద ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటైంది.

ఇది భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని అధికారుల నుంచి వచ్చే వార్తల ప్రామాణికతను ధ్రువీకరిస్తుంది.

సమాచారం సరిగా ఉందని నిర్ధారించిన తరువాత ఎఫ్ సీయూ తన సామాజిక మాధ్యమ వేదికలపై ప్రచురిస్తుంది.

సమాజానికి అండగా నిలిచే సంస్థలను, నమ్మకాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. తప్పుడు సమాచారం వల్ల కలిగే హానిని పరిష్కరిస్తూనే.. సృజనాత్మక స్వేచ్ఛను కాపాడటం దీని విధానం.

రాజ్యసభలో శ్రీ మోహమ్మద్ నదీముల్ హక్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ సమాచారాన్ని నేడు సమర్పించారు.

# విత్తన అవసరాలను ఏకీకృతం చేయడానికి మరియు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి జాతీయ మఖానా

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:నేడు న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో వ్యవసాయ ఉ రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది అధ్యక్షతన జరిగిన జాతీయ మఖానా బోర్డు యొక్క మొదటి బోర్డు సమావేశం, బోర్డు మరియు కేంద్ర రంగ పథకం రెండింటికీ అమలు ప్రక్రియను ప్రారంభించింది.

రాష్ట్రాలు మరియు పరిశోధనా సంస్థలు సమర్పించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికలను బోర్డు సమీక్షించింది మరియు సమగ్ర రంగ అభివృద్ధి లక్ష్యంగా వివిధ భాగాలకు బడ్జెట్‌లను కేటాయించింది.

ప్రస్తుత మరియు వచ్చే సంవత్సరానికి బీహార్‌లోని సాంజ సబోర్ మరియు అంజ సమస్తిపూర్ ద్వారా సరఫరా చేయాల్సిన రాష్ట్రాల విత్తన అవసరాన్ని ఏకీకృతం చేయవలసిన అవసరాన్ని బోర్డు నమావేశం నొక్కి చెప్పింది.

రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, సెంట్రల్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, బీహార్ మరియు ఔఖీఅ మఖానా దర్భంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన శిక్షకులకు సాంప్రదాయ మరియు సాంప్రదాయేతర ప్రాంతాలలో మఖానా సాగును సులభతరం చేయడానికి మఖానా విలువ గొలుసు యొక్క తాజా సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తాం ు. అవసరాన్ని బట్టి పరిశోధన, సాగు మరియు ప్రాసెసింగ్ కోసం సాంకేతికతల అభివృద్ధి, గ్రేడింగ్, ఎండబెట్టడం, పాపింగ్ మరియు ప్యాకేజింగ్ కోసం మౌలిక సదుపాయాలు, ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించడం, విలువ జోడింపు, బ్రాండింగ్, మార్కెట్ లింకేజీలు మరియు ఎగుమతి సంసిద్ధత యొక్క అవసరాన్ని కూడా బోర్డు నొక్కి చెప్పింది.

ఈ ప్రాథమిక సమావేశం భారతదేశం అంతటా మఖానా రంగం యొక్క సమన్వయం, శాస్త్రీయ మరియు మార్కెట్ -ఆధారిత వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను నిర్దేశించింది.

## మరోసారి సేవ చేసే అవకాశం ఇవ్వండి..

కరీంనగర్, డిసెంబర్ 13: రాజారం గ్రామ ప్రజలు టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని రాజారం సర్పంచ్ అభ్యర్థి రంగు అశోక్ కోరారు. శనివారం ఆయన పెద్ద ఎత్తున గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం మరోసారి అవకాశం కల్పించి సేవ చేసే అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

రంగు అశోక్ ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చేసిన కృషి గ్రామస్తులకు తెలిసిందే. అందువల్ల, ప్రజలు ఆయనను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద నష్టాలను అంచనా వేయడానికి ప్రమాణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రాష్ట్రాలకు మరియు రైతులకు స్వచ్ఛందంగా ఉంటుంది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలు/ ప్రాంతాలకు విత్తడానికి ముందు నుండి కోత తర్వాత వరకు నివారించలేని సహజ ప్రమాదాల వల్ల కలిగే పంట నష్టానికి వ్యతిరేకంగా ఈ పథకం సమగ్ర ప్రమాద బీమాను అందిస్తుంది. అడవి జంతువుల వల్ల పంటలకు జరిగే నష్టాలు, ప్రకృతిలో నివారించదగినవి కాబట్టి, ముందుగా కవర్ చేయబడలేదు. అయితే, పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మరియు రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో అడవి జంతువుల నష్టాలను వ్యక్తిగత అంచనాపై యాడ్ ఆన్ కవర్‌గా తెలియజేయడానికి రాష్ట్రాలకు అనుమతి ఉంది. అటువంటి కవరేజ్ కోసం వివరణాత్మక ప్రోటోకాల్ పథకం యొక్క కార్యాచరణ మార్గదర్శకాలలో ఇవ్వబడింది.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద నోటిఫై చేయబడిన అన్ని పంటలకు ముంపు ప్రమాద కవరేజ్ అందుబాటులో ఉంది. అయితే, వరి, జనపనార, మెస్తా, చెరకు వంటి హైడ్రోఫిలిక్ పంటలకు, స్థానికీకరించిన క్లెయిమ్‌ల విషయంలో తప్ప అటువంటి కవరేజ్ అందుబాటులో ఉంది.

అయితే, "స్థానికీకరించిన ప్రమాదంలో వరి పంటకు అడవి జంతువుల దాడి మరియు ముంపు ద్వారా పంట నష్టానికి సంబంధించిన పద్ధతులను నిర్వచించడం" కోసం ఏర్పాటు చేయబడిన కమిటీ ఈ నష్టాల కవరేజ్ కోసం సిఫార్సులు మరియు గాఖలతో పాటు తన నివేదికను సమర్పించింది. ఈ సమాచారాన్ని వ్యవసాయం మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ ఈరోజు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో ఇచ్చారు.

# భారతదేశం అంతటా మ్యూచువల్ ఫండ్ యాక్సెస్‌ను విస్తరించడానికి పోస్ట్స్ విభాగం మరియు ల్యాండ్‌మార్క్ ఎంఓయుపై సంతకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13:దేశవ్యాప్తంగా ఆర్థిక చేరికను బలోపేతం చేయడం మరియు పెట్టుబడి ఉత్పత్తులకు యాక్సెస్‌ను విస్తరించే దిశగా ఒక ప్రధాన అడుగులో, భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖకు చెందిన పోస్ట్స్ విభాగం మరియు ఆసియాలోని పురాతన స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన బాఇ, డిసెంబర్ 12, 2025న న్యూఢిల్లీలో ఒక మైలురాయి అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ చొరవ 2025?26 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఉంది, ఇది గ్రామీణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాలలో ఆర్థిక కార్యకలాపాలకు ఉత్ప్రేరకంగా ఇండియా పోస్ట్ యొక్క విస్తృతమైన పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించడాన్ని నొక్కి చెప్పింది. దేశవ్యాప్తంగా దాని విస్తృత ఉనికితో, ఇండియా పోస్ట్ ఆర్థిక యాక్సెస్‌ను మరింతగా పెంచడంలో మరియు సమ్మిళిత వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఇండియా పోస్ట్ దాని విస్తారమైన పోస్టల్ నెట్‌వర్క్ ద్వారా మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తుల పంపిణీదారుగా వ్యవహరించడానికి వీలు కల్పిస్తుంది, గ్రామీణ, సెమీ-అర్బన్ మరియు తక్కువ సేవలందించే ప్రాంతాలలోని పౌరులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది. దేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ పంపిణీ వేదిక అయిన బాఇ స్టార్ ఓఈ తో ఇండియా పోస్ట్ యొక్క సాటిలేని చివరి మైలు ఉనికిని కలపడం ద్వారా, పెట్టుబడి అవకాశాలను ప్రజాస్వామ్యీకరించడం మరియు ఆర్థిక మార్కెట్లలో విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ చొరవ లక్ష్యం.

ఈ ఒప్పందంపై తపాలా శాఖ జనరల్ మేనేజర్ శ్రీమతి మనీషా బన్సాల్ బాదల్ మరియు బాఇ ఓఆ ఉ అఖా శ్రీ సుందరరామన్ రామమూర్తి అధికారికంగా రెండు సంస్థల సీనియర్ అధికారుల సమక్షంలో సంతకం చేశారు.

ఒప్పందం ప్రకారం, ఎంపిక చేసిన పోస్టల్ ఉద్యోగులకు మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లుగా శిక్షణ ఇవ్వబడుతుంది మరియు ధృవీకరించబడుతుంది, దీని వలన వారు బాఇ స్టార్ ఓఈ ప్లాట్‌ఫామ్ ద్వారా పెట్టుబడిదారుల సేవలను అందించడానికి మరియు మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను సులభతరం చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ ఒప్పందం 12.12.2025 నుండి 11.12.2028 వరకు మూడు సంవత్సరాల పాటు పునరుద్ధరణకు నిబంధనలతో చెల్లుబాటులో ఉంటుంది.

సహకారంలో భాగంగా, బాఇ మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తుల పారదర్శకత మరియు సమ్మతి పంపిణీని నిర్ధారిస్తూ, అధీకృత సిబ్బంది కోసం ఉద్యోగి ప్రత్యేక గుర్తింపు సంఖ్యలను ఉత్పత్తి చేయడం ద్వారా అర్హత కలిగిన మరియు శిక్షణ పొందిన పోస్టల్ అధికారుల ఆన్‌బోర్డింగ్‌ను సులభతరం చేస్తుంది. పోస్టల్ ఉద్యోగులు మరియు ఏజెంట్లు తప్పనిసరి ఔఎాఓ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్) మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ సర్టిఫికేషన్ పొందేందుకు వీలు కల్పించడం ద్వారా బాఇ ధృవీకరణ ప్రక్రియకు మద్దతు ఇస్తుంది. ఈ సర్టిఫైడ్ అధికారులు, శిక్షణ పొందిన తర్వాత, కస్టమర్లకు సమాచారంతో కూడిన పెట్టుబడి ఎంపికలలో సహాయం చేస్తారు, మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను అమలు చేస్తారు మరియు చివరి మైలు వద్ద పెట్టుబడిదారుల మద్దతు సేవలను అందిస్తారు.

# మార్మోగుతున్న ఇంద్రకీలాద్రి

**-అరుణ ప్రవాహం**

**-దుర్గ గుడి సువర్ణ శోభితం**

**-మిరుమిట్లు గొల్పే దీపాలంకరణ..**

**-విరమణ ఉత్సవం ఆరంభం**



అమరావతి, డిసెంబర్ 13: వేల సంఖ్యలో తరలివస్తున్న భవానీ దీక్ష పరులతో అమ్మవారి ఆలయం అరుణ శోభితంగా సాక్షాత్కరిస్తుంది. దీక్ష విరమణ కోసం అమ్మవారి ఆలయంతో పాటు ఇంద్రకీలాద్రి సర్వాంగ సుందరంగా ముస్తాబుకావడం, క్షణక్షణం అమ్మవారి నామస్మరణ మారుమ్మగతుండటం సప్తవర్ణ సువర్ణ శోభిత అలంకరణ విరమిడ్లు గొల్పే విద్యుత్ దీపాలంకరణలో ఇంద్రకీలాద్రి మెరుస్తోంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న భవాని దీక్ష విరమణ మహోత్సవం మూడో రోజుకు చేరుకుంది. గడిచిన మూడు రోజుల్లో సుమారు రెండున్నర లక్షలకు పైగా భవానీలు అమ్మవారిని దర్శించుకుని పరమ పవిత్రంగా ఇరుముడిని సమర్పించుకున్నారు.

భవానీల రాక క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయగా, లోటుపాట్లకు తావే ఇవ్వకుండా అనుక్షణం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో దుర్గగుడి ఈవో, చైర్మన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

దీక్ష విరమణ కోసం రాష్ట్రం నలుమూలలతో పాటు పక్క రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భవానీలు ఇంద్రకీలాద్రి కి పోటెత్తుతున్నారు. మండల అర్ధ మండల దీక్ష తీసుకున్న భవానీళ్లు నియమనిష్టలతో దీక్షను ఆచరించి, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని, ఇరుముడిలను సమర్పిస్తున్నారు. కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ పూర్తి చేసి ప్రత్యేక క్యూ లైన్ ల ద్వారా కొండమీదకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కొండ దిగువున్న మహా మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీక్ష విరమణ ప్రాంతంలో గురుభవానిలతో దీక్షను విరమింపు చేసుకుని ఇరుముడిలను సమర్పించుకుని పవిత్ర హోమగుండాలలో నేతి కొబ్బరికాయలను సమర్పిస్తున్నారు.

అక్కడే ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భవానీలు తమకు కావాల్సినంత లడ్డూలను కొనుగోలు చేస్తున్నారు. గురువారం నుండి ప్రారంభమైన దీక్ష విరమణకు సంబంధించి శనివారం రాత్రి సమయానికి సుమారు రెండున్నర లక్షలకు పైగా భవానీలు దర్శించుకున్నట్లు ఒక అంచనా. శుక్రవారం 96 వేల మంది భవానీలు అమ్మవారిని దర్శించుకోగా శనివారం లక్షకు పైగా భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు. లడ్డులు కూడా కొనుగోలు చేస్తుండడంతో లక్షల సంఖ్యలో లడ్డు విక్రయాలు జరుగుతుండడం, తలనీలాలతో పాటు వివిధ మార్గాలలో అమ్మవారికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

దుర్గగుడి దేవస్థానం ఆధ్వర్యంలో భవానీల కోసం విస్తృత ఏర్పాటు చేయగా భవానిలకు అందుతున్న మౌలిక సదుపాయాలు లోటుపాట్లను క్షేత్రస్థాయిలోనే ఉండి ఈవో శీనా నాయక్ దుర్గ గుడి చైర్మన్ బొర్రా గాంధీతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఇంద్రకీలాద్రి కనకదుర్గ నగర్ క్యూ లైన్లతో పాటు గిరిప్రదక్షిణ జరుగుతున్న ప్రాంతాలలో విస్తృతంగా పర్యటిస్తున్న వీరు కేశఖండనశాల పుణ్యస్నానాలు ఆచరిస్తున్న గాట్ వంటి ప్రాంతాలను పర్యటిస్తూ అక్కడ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. భవానీలకు అందుబాటులో మెడికల్ క్యాంపులను సైతం ఏర్పాటు చేసిన అధికారులు, అవసరమైనన్ని మంచినీటి బాటిళ్లు బిస్కెట్ ప్యాకెట్లు పాలు అందుబాటులో ఉంచారు. ఆదివారం సెలవు దినం కావడం తో భవానీలో రాక మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లు కూడా అధికారులు విస్తృతం చేశారు.

## ప్రజల అవకాశం ఇస్తే 24 గంటలు సేవ చేస్తా

నాయకపుగూడ,డడిసెంబర్ 13: నాయకపుగూడ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ఈనెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకపుగూడా సర్పంచ్ అభ్యర్థి ఎదుల దేవకి ఇంటింటి ప్రచారం చేశారు.

గ్రామంలోని నెలకొన్న అన్ని సమస్యలను సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే తెలుసుకుని, ఎప్పటికప్పుడు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

అదనంగా, ప్రజలకు అన్ని సమయాల్లో 24 గంటలు అందుబాటులో ఉంటానని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆమె వెంట వార్డు మెంబర్లు, పిఎస్ఎస్ వైస్ చైర్మన్, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహం

అమరావతి, డిసెంబర్ 13: మొవ్వ మండలం కరకంపాడులో రైతుల ఇబ్బందులను మంత్రి కొలుసు పార్థసారధి అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో రైతులు తమ ఆవేదనను మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి ధాన్యం ఎందుకు కొనుగోలు చేయట్లేదని అధికారులను ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్, డీఎంతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రియదర్శిని విద్యా సంస్థలకు హైయర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

– ప్రదానం చేసిన ప్రముఖ ఎట్ టెక్ సంస్థ

– అవార్డు అందుకున్న ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు



ఖమ్మం, డిసెంబర్ 13: దేశంలోని విద్యా సంస్థల్లో అత్యున్నత స్థాయికి చేరుకుని సమాజాన్ని ప్రభావితం చేస్తున్న సంస్థలను గుర్తించి వాటికి అరుదైన గౌరవం ఇస్తున్న విద్యా శిక్షణా రంగ సంస్థ ఎట్ టెక్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 2024-2025 సంవత్సరానికి గాను హైయర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రియదర్శిని విద్యా సంస్థలు దక్కించుకున్నాయి. శనివారం హైదరాబాద్ హైటెక్స్ లో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు అందుకున్నారు. తమ 25 సంవత్సరాల నిరంతర కృషికి, విద్యార్థిని విద్యార్థులను ఉన్నత విలువలతో తీర్చిదిద్దిన విధానాలకు దక్కిన గుర్తింపుగా తాము ఈ అవార్డును స్వీకరిస్తున్నామని తెలుపుతూ నవీన్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

తమను నమ్మి వచ్చిన ప్రతి విద్యార్థులు అత్యున్నత స్థాయిలో స్థిరపడటానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించడం వల్లే ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు అత్యున్నత స్థితిలో ఉన్నారని, అలాంటి తమ కృషికి పురస్కారం లభించడంపై విద్యా సంస్థల డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ పురస్కారం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ అన్నారు. అవార్డు స్వీకారంపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ వి.రామారావు, నయీం పాషా, డైరక్టర్ శ్రీ రామినేని, చలపతిరావు, అకడమిక్ డైరెక్టర్ ఎం.శివకుమార్, వివిధ విభాగాల హెచ్.ఓ.డిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తమ సంస్థ సాధించిన మైలురాయికి ఆనందం వ్యక్తం చేశారు.

# కాసిపేటలో పంచాయతీ ఎన్నికలకు అంతా సిద్ధం

ఆదిలాబాద్, డిసెంబర్ 13: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో పంచాయతీ ఎన్నికలకు అధికారులు అంతా సిద్ధం చేశారు. రెండో విడుత ఎన్నికలు ఆదివారం జరుగనుండగా అధికారులు అన్ని ఏర్పాటు చేశారు.

కాసిపేట కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల అధికారులకు, సిబ్బందికి పంపిణీ చేశారు. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల ఉత్తర్వుల కాపీలతో పాటు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, తదితర సామగ్రితో ఎన్నికల సిబ్బంది చేరి ఏర్పాట్లు చేశారు.

మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉండగా ధర్మారావుపేట పంచాయతీ ఏకగ్రీవం కాగా మిగతా 21 పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. 21 పంచాయతీల్లో 64 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 190 వార్డులు ఉండగా 48 మంది ఏకగ్రీవం కాగా 133 వార్డుల్లో ఎన్నికలు జరగనుండగా 349 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉండగా 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి తర్వాత ఫలితాలు ప్రకటించనున్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# ఉదయం విజ్ఞప్తి, సాయంత్రం మంజూరు..అంధుల క్రికెట్ మహిళా కెప్టెన్ కోరికను నెరవేర్చిన పవన్‌కల్యాణ్




అమరావతి, డిసెంబర్ 13:అంధ మహిళా క్రికెట్ కెప్టెన్ దీపిక విజ్ఞప్తికి ఏపీ అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించారు. అంధ మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌ను సాధించి వచ్చిన జట్టు నిన్న (శుక్రవారం ఉదయం) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఒక్కో క్రీడాకారిణికి రూ.5 లక్షల చొప్పున సొంత డబ్బును అందజేసి సన్మానించారు.

క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలానికి చెందిన దీపిక తన గ్రామ రోడ్ల పరిస్థితిని డిప్యూటీ సీఎంకు విన్నవించింది. దీంతో వెంటనే స్పందించిన పవన్ కళ్యాణ్ సంబంధిత జిల్లా అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

దీంతో స్పందించిన అధికారులు గ్రామానికి వెళ్లి రోడ్ల పరిస్థితిని పరిశీలించి నివేదికను డిప్యూటీ సీఎంకు వివరించారు. హేమావతి పంచాయతీ పరిధిలోని తంబలహెట్టి వరకు రూ. 3.2 కోట్ల రోడ్డు, గున్నేహళ్లి నుంచి తంబలహెట్టి వరకు రూ. 3 కోట్లతో 5 కి.మీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపగా సాయంత్రం పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేశారు.

# ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, డిసెంబర్ 13: రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కామేపల్లి మండల కేంద్రంలో గల పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఉద్యోగి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల సామగ్రిని ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాలెట్ పంపిణీ, స్వీకరణ జరగాలన్నారు. ప్రతి బండిల్‌పై సీల్, సంతకాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు ఎన్నికల సామాగ్రి సరఫరా వ్యవస్థ,రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను పరిశీలించారు.

సామగ్రి పంపిణీ సమయంలో ప్రతి పోలింగ్ బృందానికి అవసరమైన సామగ్రిని సమయానికి అందించేందుకు ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. బృందాలు వచ్చిన క్రమానుసారం రిజిస్ట్రేషన్ నుంచి మెటీరియల్ పంపిణీ వరకూ మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఎక్కడ ఆలసత్వం, అయోమయం తలెత్తకుండా తగిన సూచిక బోర్డులు, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలింగ్ సిబ్బందికి త్రాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య అత్యవసర సదుపాయాల లభ్యతను అడిగి తెలుసుకున్నారు.

# పంచాయతీల్లో గెలుపే.. బీఆర్ఎస్ పార్టీకి బలం : ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆదిలాబాద్, డిసెంబర్ 13:పంచాయతీ ఎన్నికల్లో గెలుపే బీఆర్ఎస్‌పార్టీకి కొండంత బలమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలానికి చెందిన మాన్కాపూర్, గంగాపూర్, మహాగావ్, బేతాల్ గూడ, జామడ, గుంజాల, మాలేపూర్ పంచాయతీలకు చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు శనివారం కొమురం భీం జిల్లా (అసిఫాబాద్) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. కష్టపడి ప్రజల సహకారంతో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేకపోయినా నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కోట్లాడైనా నిధులు తీసుకువచ్చి పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి మేస్రం దుర్గుపటేల్, మాజీ ఎంపీపీ మేస్రం రూప్ దేవ్, నాయకులు ఉర్వేత రూప్ దేవ్,సయ్యద్ ఖాసిం, రాథోడ్ దిగంబర్,మాల్కుపటేల్ తదితరులున్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

– మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నల్గొండ, డిసెంబర్ 12: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు సేవ చేసే నాయకులను సర్పంచ్‌గా ఎన్నుకోవాలని సూచించారు. రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. గ్రామాల్లో గత సర్పంచులు చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సజావుగా జరగాల్సిన ఎన్నికలు అలజడుల మధ్య జరుగుతున్నాయన్నారు.

ఇప్పటికే నియోజకవర్గంలో పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను ఎన్నికల బరిలో పోటీ చేయకుండా, నామినేషన్లు వేయకుండా విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులను బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా నిలిపారని కొనియాడారు. వందల కోట్లతో మన ఊరు మన పల్లె కార్యక్రమాన్ని చేపట్టి.. పల్లెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. అందువల్ల విచక్షణతో ఆలోచించి ఓట్లు వేయాలని నియోజకవర్గ ప్రజలను ఆయన కోరారు.

# డీఏవీలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖమ్మం, డిసెంబర్ 13:ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని మాదారం వీఎస్పీ టౌన్‌షిప్‌లో గల డీఏవీ పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు శనివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన నాటి ఉపాధ్యాయులను మేళతాళాలు, చప్పుళ్లతో సభా స్థలానికి ఆహ్వానించారు. ఉపాధ్యాయులకు పుష్ప గుచ్చాలు అందజేస్తూ వేదికపైకి సగౌరవంగా తీసుకెళ్లారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాతికేళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై చేరుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్నేహితులందరూ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు చన్నంగల గడ్డ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బోయిన ముత్తయ్య ప్యాడ్లు, పెన్నులు, పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.నరసింహారావు, పూర్వ విద్యార్థులు పి.రమ్య, మధులత, పద్మజ, సునీల్, రవి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.






# మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌కు చెక్‌పెట్టేందుకు.. నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ మరింత బలోపేతం..

హైదరాబాద్, డిసెంబర్ 13:శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై నగరంలో పటిష్టమైన నిఘా ఉంటుందని, అదే స్థాయిలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తు మహమ్మారికి మూలమైన డ్రగ్స్ నేరగాళ్లు, పెడ్లర్లపై కూడా నిఘా పెడతామని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో శుక్రవారం సీపీ సజ్జనార్ అధ్యక్షతన జరిగిన అత్యున్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఐబీ, డీఆర్ఐ, ఎన్‌సీబీ, ఎక్సైజ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, ఈగల్, ఎఫ్ఆర్ఆర్ఓ, తదితర కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల అధికారులు పాల్గొన్నారు.నగరంలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌కు చెక్‌పెట్టేందుకు హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న బృందాలకు అదనంగా మరో నాలుగైదు కొత్త బృందాలను చేరుస్తున్నామని, ఈ బృందాలు క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, నిందితుల అరెస్ట్‌ల్లో కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్కరోజుతో ముగిసే ప్రక్రియ కాదని, అది నిరంతర పోరాటమని, ఈ క్రమం లో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇకపై ప్రతినెలా అన్ని ఏజెన్సీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి కేసుల పురోగతి ని సమీక్షిస్తామని, డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. పాత కేసులు, నిందితుల కదలికలు, కొత్త నేర పద్ధతులపై ఏజెన్సీలన్నీ ఎప్పటికప్పుడు సమాచారాన్ని మార్పిడి చేసుకోవాలని, డ్రగ్స్ రవాణాకు కొరియర్ సర్వీసులు వేదికగా మారుతున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. డ్రగ్స్ రవాణా, వినియోగంలో విదేశీయుల పాత్ర, విమానాశ్రయా ల్లో ప్రయాణికుల సమాచారం ఆధారంగా సంబంధిత ఏజెన్సీలు నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమానితుల కదలికలపై నిఘా పెట్టడంపై సుదీర్ఘంగా చర్చించారు.

వైద్యం కోసం నగరానికి వచ్చి ఆసుపత్రుల్లో చేరకుండా తిరుగుతున్న విదేశీయుల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఇలాంటి వారి వివరాలను డీఆర్ఐ, ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులతో పంచుకుని.. వారిని వెంటనే ట్రాక్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# హింస, అక్రమ రవాణా నివారణకు మై ఛాయిస్ ఫౌండేషన్




హనుమకొండ, హింస, అక్రమ రవాణా నివారణకు మై ఛాయిస్ ఫౌండేషన్ మహిళలు, పిల్లలపై జరుగుతున్న హింస, అక్రమ రవాణా నివారణ కోసం మై ఛాయిస్ ఫౌండేషన్ పనిస్తుందని స్టేట్ కోఆర్డినేటర్ జన్ను క్రాంతి తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంస్థ తన కార్యక్రమాలను ఆపరేషన్ పీస్ మేకం , ఆపరేషన్ రెడ్ అలర్ట్ ద్వారా అమలు చేస్తోందని తెలిపారు.

ఆపరేషన్ పీస్ మేకర్ గృహ హింసను నివారించడంపై దృష్టిపెట్టి, సురక్షితమైన కుటుంబ వాతావరణాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. అవగాహన, కౌన్సెలింగ్ సహాయం, న్యాయ-సామాజిక సేవలకు అనుసంధానం అందిస్తుందని, గృహ హింసకు జాతీయం హెల్ప్‌లైన్ 9333404141 అందుబాటులో ఉందన్నారు. ఆపరేషన్ రెడ్ అలర్ట్ పిల్లల అక్రమ రవాణా నివారణకు సమాజంలో అవగాహన కల్పిస్తుందని, సేఫ్ విలేజ్ కార్యక్రమాల ద్వారా కుటుంబాలు, యువతను అప్రమత్తం చేస్తుందన్నారు.

ట్రాఫికింగ్‌కు సంబంధించిన సహాయానికి టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1800-419-8588 అందుబాటులో ఉందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ ఎం.రత్నశ్రీ, సెంటర్ కోఆర్డినేటర్ జి.రీనా, అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.మౌనిక, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.భువన, ఫీల్డ్ ట్రైనర్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

# చాంద్రాయనగుట్టలో దారుణం.. పదేండ్ల బాలుడిని నేలకేసి కొట్టిన సవతి తండ్రి

హైదరాబాద్, డిసెంబర్ 13: హైదరాబాద్‌లోని చాంద్రాయనగుట్టలో దారుణం చోటుచేసుకున్నది. పక్కింటి వారిని తిట్టాడనే కోపంతో పదేండ్ల బాలుడిని సవతి తండ్రి నేలకేసి కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాంద్రాయనగుట్ట ఘాజిమిల్లత్ కాలనీలో కి చెందిన నఫీస్ బేగంకు మొదటి భర్తతో కుమార్తె(15), కొడుకు షేక్ అజ్మత్ అజ్‌హర్(10) సంతానం ఉన్నారు. అయితే మాసబ్‌ట్యాంక్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను ఆమె రెండో వివాహం చేసుకున్నది.

కాగా, అజ్‌హర్ ఈ నెల 7న పక్కింటి వారితో గొడవ పడ్డాడు. బాధితులు వీూ అబ్బాయి బూతులు తిట్టాడని సవతి తండ్రికి చెప్పారు.

దీంతో గ్రహించిన ఇమ్రాన్.. అజ్‌హర్‌ను చెంపదెబ్బలు కొట్టాడు. అంతటితో ఆగకుండా అతడిని అమాంతం లేపి రోడ్డుకేసి కొట్టాడు. తలకు తీవ్రంగా గాయమవడంతో చెవుల నుంచి రక్తం వచ్చింది. దీంతో అతడిని ఒవైసీ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అజహార్ మృతిచెందాడు. దీంతో కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

## - పోలింగ్, కౌంటింగ్ పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి-జిల్లా ఎస్పీ మహేష్ బి గితేం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా తంగలపల్లి పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు,సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రెండవ విడత ఎన్నికల నిర్వహణకు రూట్ మొబైల్స్ : 26 జోనల్ టీమ్స్ : 07 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో),క్విక్ రియాక్షన్ టీమ్స్ : 03,స్ట్రయికింగ్ ఫోర్స్:02 ఏర్పాటు చేసి మొత్తం 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ సమయంలో, కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని సూచించారు. రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల నియమావళిని ప్రజలు పాటిస్తూ, పోలీసులకు సహకరించి స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 9 కేసులు నమోదు, రూ. 23,28,500 నగదు సీజ్, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వహించిన దాడుల్లో 93 కేసుల్లో 1387 లీటర్ల మద్యం సీజ్, 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే, ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, సిఐలు, ఎస్ఐ సిబ్బంది ఉన్నారు.

# రెండో విడత పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు : పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

కరీంనగర్, డిసెంబర్ 13:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దపల్లి జోన్ పరిధిలో పాలకుర్తి , అంతర్గం , జూలపల్లి , ధర్మారం మండలాలలో 73 గ్రామపంచాయతీలు, మంచిర్యాల జోన్ పరిధిలో బెల్లంపల్లి , కన్నేపల్లి , భీమిని, తాండూర్, నేన్నెల, కాసిపేట్, వేమనపల్లి మండలాల్లో 114 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు జరుగబోతున్నాయని వివరించారు.

ఇద్దరు డీసీపీలు, ఏసీపీలు ఏడుగురు, 30 మంది సీఐలు, 95 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు , హోం గార్డులు, ఆర్మ్డ్ సిబ్బంది , క్యూఆర్ టీమ్స్,రూట్ మొబైల్ పార్టీలు మొత్తంగా 1,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేశామని, చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేశామని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే, స్థానిక పోలీస్, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

# సీనియర్ పాత్రికేయులు కు చెల్మెడ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): :వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్, ప్రముఖ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకుప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ గోలి మహేష్, నాయకులు నీరటి మల్లేశం, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప పడి పూజలో బీఆర్ఎస్ చెల్మెడ



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 6వ వార్డులో ఉన్న అయ్యప్ప ఆలయంలో శనివారం పడిపూజ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి ఆలయ చైర్మన్ కొండ దేవయ్య ఘనంగా స్వాగతం పలికారు. వారి వెంట జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవ రెడ్డి, సీనియర్ నాయకులు పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, గోలి మహేష్, నాయకులు కొండ కనకయ్య, కొండ నరసయ్య, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, నీరటి మల్లేశం, సుంకపాక రాజు, రాకేష్, కూన సతీష్, వినీత్, సాయిపటేల్, తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగాఆరట్టు మహోత్సవం

## -అయ్యప్ప స్మరణతో మారు మోగిన ఆలయ ప్రాంగణం

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బిఆర్ఎస్, బీజేపీ నేతల ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారంఆరట్టు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చెర్మన్ శ్రీ కొండ దేవయ్య గురు స్వామి గారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు గణపతి హోమము, వేదమంత్రాలతో నిర్వహించారు. దేవాలయంలో ఉదయం గజ గౌరీ వ్రతం, ఆలయం ముందు అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం, అభిషేకములు నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప అయ్యప్ప భక్తుల శరణు ఘోషతో ఆలయం మారుమోగింది. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు భిక్ష, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహరావు, బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ, న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, ఏనుగు మనోహర్ రెడ్డిలు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలోపొలాస నరేందర్, రామతీర్థపు రాజు, బింగి మహేష్ కానికరపు రాకేష్, కుమ్మరి శంకర్ చంద్రగిరి శ్రీనువాసు కట్కూరిశ్రీనివాస్, నామాల పోశెట్టి కోయినేని బాలయ్య చిలుక రమేష్, పుల్కం రాజు, నిమ్మశెట్టీ విజయ్, మారం కుమార్, నీలం శేఖర్ సిరిగిరి చందు,నరాల శేఖర్,గొలి మహేష్, బత్తుల మహేందర్ యాదవ్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలోఅయ్యప్ప స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు యశ్వంత్, ఆలయ గురుస్వామి బొంగొని అంజయ్య, గురు స్వామి ఆర్గనేషన్ కమిటీ సభ్యులు కొండ కనకయ్య, నరసయ్య కొండ లక్ష్మణ్ కొండ కృష్ణ, అయ్యప్పస్వామి భక్తులు మహంకాళి శ్రీనువాసు గౌడ్, గురు స్వామి యమహా శ్రీను, స్వామి, ఆర్టీసీ శ్రీను, గురు స్వామి మారం ప్రశాంత్, స్వామి, సత్తిపండు, స్వామి, గజవాడ నాగరాజు, నాగుల నాగరాజు, గురు స్వామి కపిల్ శ్రీనువాసు, గురు స్వామి, నూగురి మహేష్, గురు మ్యాన సంతోష్, గురుస్వామి స్వామి, పిల్లి శ్రీను స్వామి, ఆలయ ఆస్థాన గాయకులు మిద్దె పరశురామ్,గోపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తలసాని నివాసానికి యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్

హైదరాబాద్, డిసెంబర్ 13:రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ నగరానికి వచ్చిన సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన నివాసానికి ఆహ్వానించారు.

ఈ మేరకు శనివారం సాయంత్రం అఖిలేష్ యాదవ్ జూబ్లీహిల్స్ లోని తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులు అఖిలేష్ యాదవ్‌కు స్వాగతం పలికారు.

# అయ్యప్ప స్వామి సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోగల అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి వారి ఆరట్టు ఉత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకొన్నారు. ముందుగా ఆలయ చైర్మన్ కొండదేవయ్య స్వాగతం పలికారు.

# రాబోయే సమ్మక్క సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13:నేటినిజం (ప్రతినిధి): :రాబోయే సమ్మక్క సారలమ్మ జాతరకు వేములవాడకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ పరిసర ప్రాంతాల్లో పలు మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో తగిన విధంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, భక్తులు సేద తీరేందుకు చెరువు ప్రాంతాన్ని నీటితో నింపుతున్నారు. అదేవిధంగా క్యూలైన్లను రంగులు సక్రమంగా ఏర్పాటు చేయడంతో పాటు, శుభ్రమైన మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తున్నారు. భక్తులకు తాగునీరు, విశ్రాంతి మరియు భద్రతకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, జాతరను సజావుగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

# మా ఆలయం క్యాసెట్ ఆవిష్కరణ..

వరంగల్,డిసెంబర్ 12: వరంగల్ నగరంలోని శివనగర్ శ్రీశివ విఘ్నేశ్వర దత్త సాయి దేవాలయం ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో మా ఆలయం క్యాసెట్ కట్ట మల్లన్న దేవస్థానం వేదికగా పోలా ఉమామహేశ్వర్ గురుస్వామి చేతుల మీదుగా ఆడియో క్యాసెట్ అంగరంగ వైభవంగా ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంలో ఆలయం కార్యదర్శి చింతం యాదగిరి మాట్లాడుతూ, గాయకుడు పాలకుర్తి శ్రీనివాస్ గౌడ్ తన స్వంత రచనతో వ్రాసి, మధురమైన గానంతో శ్రీ విఘ్నేశ్వర ఆలయం కోసం గానం చేసిన గీతం ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కవి గాయకులు శ్రీనివాస్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పలు ఆలయ ట్రస్ట్ సభ్యులు కూడా ఆయనను అభినందించారు.

# రెండు, మూడో విడత ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.. బీసీలకు దాసోజు శ్రవణ్ పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 13:నాలుగు కోట్ల మంది ప్రజలున్న తెలంగాణలో రెండు కోట్లకు పైగా బీసీలు ఉన్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. మెస్సీతో కాదు.. గుంపు మెస్త్రీ బీసీలతో ప్రతిరోజూ ఫుట్‌బాల్ ఆడుతున్నాడని విమర్శించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీ ప్రైవేటు బిల్లు ప్రవేశపెడుతున్నందుకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీసీ బీఆర్ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, శ్రీనివాస్ గౌడ్, ఎల్.రమణతో కలిసి దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తర్వాత జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే బీసీలను తడిగుడ్డ పెట్టి గొంతు కోసేలా ఉందని అన్నారు. ప్రజా కోర్టులో రేవంత్ రెడ్డిని శిక్షించాలన్నారు.

బీసీ జాతి కోసం సాయి ఈశ్వర్ చారి బలిదానం చేసుకున్నాడని దాసోజు శ్రవణ్ తెలిపారు. ఆరు నెలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు ఇచ్చారని అన్నారు. అవినీతి కేసులపై పెద్ద పెద్ద లాయర్లు పెట్టుకునే రేవంత్ రెడ్డి.. బీసీల హక్కులను కాపాడేందుకు పెద్ద పెద్ద లాయర్లను ఎందుకు పెట్టుకోవడం లేదని ప్రశ్నించారు.

# పేదల ఆరోగ్యానికి వైసీపీ భరోసా

## ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నిర్వీర్యం-మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అమరావతి, డిసెంబర్ 13: వైఎస్సార్‌సీపీ హయాంలో పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చిందని, అదే చంద్రబాబు ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ నిర్వీర్యం చేసిందని వైసీపీ సెంట్రల్ ఇంచార్జి మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు సైతం కార్పొరేట్ వైద్యంను అందించటం జరిగిందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీను నిర్వీర్యం చేసి ప్రజలకు వైద్యం దూరం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విజయవాడలో 60 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ప్రతిరోజు వెయ్యి మందికి ఉచిత వైద్యం అందిసూ గుండె జబ్బు దగ్గరనుంచి వివిధ రకాలైన జబ్బుల వరకు అన్నిటికి వైద్యం అందిస్తూ ప్రజలకు భరోసా కల్పించటం జరిగిందన్నారు.

అలాగే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రామకృష్ణాపురం,సింగ్‌నగర్, బాంబే కాలనీ, అయోధ్యనగర్ లలో నాలుగు హాస్పిటల్స్ నిర్మించి ప్రజలకి అన్ని రకాల రక్త పరీక్షలు చేయటంతో పాటు మందులు కూడా అందించటం జరిగిందన్నారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు వైద్య సేవలు దూరం అయ్యాయని ఆరోపించారు. మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హాస్పిటల్స్‌ను నాడు నేడు ద్వారా అభివృద్ధిపరిచి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా తీర్చిది ద్దారని గుర్తుచేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ప్రభుత్వ హాస్పిటల్స్‌కి వచ్చి ప్రజలు మెరుగైన వైద్యం పొందేవారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటంలో విఫలమయ్యి ందన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన 18 నెలలలో రూ. 2 లక్షల 60 వేల కోట్లు అప్పు చేసింది కానీ ఆరోగ్యశ్రీ బకాయి లు తీర్చే ప్రయత్నం చేయలేదన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com